# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 8-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:220 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

నీటి ఎద్దడి
లాభసాటి వ్యాపారం
జల చోరులు.

సాహిత్య పట్టం
శుక్లాకు జ్ఞానపీఠం
కృషికి ఫలం.

మంచు నిల్వలు
నేల నీరైన వేళ
జల విధ్వంసం.

ఉగాది కాంతి
ఋతువుల ప్రవంతి
రుచుల దారి

కాశ్మీర కాంతి
తపాల చేర్చేధీర
మంచు పావురం



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

నమ్మకం పోయిందోచ్
అడుగుతుంటె అప్పులు !
బ్యాంకులన్ని తిరిగి తిరిగి
అరిగి పోయె చెప్పులు !
చెయ్యి ఒకరు కాలు ఒకరు
కోసుకొనీ తింటారా ?
దేహం తాకట్టు పెట్ట
కోట్లు పెట్టి కొంటారా ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# ఆపరేషన్ సింధూర్ విజయవంతం

## మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసింది : రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మే 7:మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌లోని ఉగ్రదాడుల శిబిరాలపై భారత్ బుధవారం వేకువ జామున దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 50 బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంబోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సైనికులు రాత్రి అద్భుత పరాక్రమం ప్రదర్శించారన్నారు. మన సైనికులు రాత్రి ఒక చరిత్ర సృష్టించారన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి సిబ్బంది లేకుండా దాడులు చేశారన్నా రు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్తిసన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్నా రు. ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి సత్తా చాటారన్నారు. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాపహాసోపేతమై న దాడి చేశారని.. సాధా రణ పౌరు లకు ఎలాంటి ఇబ్బం ది లేకుండా దాడులు చేశామన్నారు. ధైర్య సాహ సాలు ప్రదర్శించిన సైనికులకు అభిన oదన లు తెలిపారు. సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్‌నాథ్ సింగ్ ధన్యవాదాలు చెప్పా రు. పహ ల్గాంలో అమాయకులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారని ఆరో పించారు. పహల్గాం లో అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టిన ట్లు పేర్కొన్నారు. శత్రువకు సరైన బుద్ధి చెబుతామన్నారు. దేశభద్రకు భంగం కలిగించే చర్యలను సహించమన్నారు. ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులు చేశామన్నారు. లంకా దహనం చేసిన హనుమంతుడే మాకు ఆదర్శమని.. హనుమాన్ లంకా దహనం చేసినట్లే మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత్ లక్ష్యం పాకిస్తాన్ కాదని.. ఉగ్రవాదులేనన్నారు.

# ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వ కారణం.. క్యాబినెట్ భేటీలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 7:పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సేనలు దాడి చేసి దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చడం దేశానికి గర్వకారణమని ప్రధాని అన్నారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ గురించి సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా.. భారత సేనలు చేపట్టిన చర్యను క్యాబినెట్‌లోని మంత్రులంతా బల్లలు చరిచి సమర్థించారు.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సేనలు బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి దాదాపు 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్ అనంతరం ప్రధాని మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి ఆమెకు సమాచారం ఇచ్చారు.

## సామాజిక స్పృహతో "కళాకుసుమాలు" ఆచార్య ఎన్.గోపి



"కళా కుసుమాలు" పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥ఎన్.గోపి.

హైదరాబాద్, మే 7:సామాజిక స్పృహతో రాసే ప్రతీ కవిత, ప్రతీ రచన జనం లోకి వెళుతుందని తెలుగు యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్.గోపి ఉద్బోధించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనంద లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కవయిత్రి కళావతి కందగట్ల రాసిన "కళా కుసుమాలు" కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆచార్య ఎన్ గోపి ముఖ్య అతిథిగా హాజరై విడుదల చేశారు. కార్యక్రమానికి కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డా॥రాధా కుసుమ అధ్యక్షత వహించారు. సామాజిక స్పృహతో స్వీయ అనుభవాన్ని జోడించి కళాకుసుమాలు పుస్తకాన్ని రాశారని రచయిత్రి కళావతిని ముఖ్య అతిథి డా॥గోపి అభినందించారు. గౌరవ అతిథులుగా ప్రముఖ దంత వైద్యులు డా॥ కె ఎల్ వి ప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకరమణ, కలం స్నేహం సంస్థ జాతీయ ఉపాధ్యక్షురాలు హరి రమణ, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ లింగాల సంధ్యారాణి, ఇండియన్ మిస్టర్ బీన్ మైమ్ కళాధర్, వందే భారత్ సినిమా దర్శక నిర్మాత కళారత్న మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు. రచయిత్రి కళావతిని, ఆమె భర్త మైమ్ కళాధర్ ను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత 20 మంది కవులు, కవయిత్రులచే కవి సమ్మేళనం, చివర్లో మిమిక్రీ ప్రదర్శనలు జరిగాయి.

## ఘనంగా 'స్పర్శ లేని శిల' గ్రంథావిష్కరణ



పుస్తకావిష్కరణలో మౌనశ్రీ మల్లిక్, మువ్వా శ్రీనివాస్, దాస్యం సేనాధిపతి, తెలంగాణ రాష్ట్ర శాసన మండలి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, కవయిత్రి లహరి, శైలజామిత్ర, శ్రీనివాస్ గౌడ్, తదితరులు

హైదరాబాద్, మే 7:మనసుని కదిలించేది కవిత్వమని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి అన్నారు. కవయిత్రి ఎన్. లహరి రాసిన 'స్పర్శ లేని శిల' కవితా సంపుటి గ్రంథావిష్కరణ సభ ఉదయ సాహితీ, తెలంగాణ ఆధ్వర్యంలో భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి గా డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి విచ్చేసి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. రచయిత్రి లహరి తీసుకున్న ఇతివృత్తం పాతదైనా అభివ్యక్తి కొత్తగా ఉందన్నారు. కొన్నింటిలో కవితా వస్తువు కొత్తగా తీసుకొని చక్కగా ఆవిష్కరించారన్నారు. స్త్రీ భావాలను, సాధికారతను గురించి తన కవిత్వంలో చెప్పారన్నారు. కార్యక్రమానికి ప్రముఖ కవి విమర్శకుడు, ఉదయసాహితీ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీ దాస్యం సేనాధి పతి అధ్యక్షోపన్యాసం చేస్తూ లహరి రచనా శైలిలో మానవీయ కోణం చక్కగా ప్రస్ఫూటం అవుతుందని అభినందించారు.

గౌరవ అతిథి మువ్వ శ్రీనివాస్ కవయిత్రిని అభినందించారు. కవితా సంపుటి ని ప్రముఖ కవయిత్రి శ్రీమతి శైలజా మిత్ర పరిచయం చేశారు. సభలో సినీ టీ వి గేయ రచయిత శ్రీ మౌనశ్రీ మల్లిక్, కవులు, రచయితలు శ్రీనివాస్ గౌడ్, డి. మోహన్, వెంకట్ నారాయణ, డాక్టర్ సీతా లక్ష్మి బీదేళ్ల, మూర్తి శ్రీదేవి, చేపూరి విజయ్, చిందం సునీతతో పాటు ఎందరో కవులు రచయితలు పాల్గొన్నారు. ఉదయసాహితీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీమతి లక్ష్మీ పద్మజ దుగ్గరాజు వందన సమర్పణ చేశారు.

## మానవ సంబంధాలకు ఊపిరిపోయాలి



"నాతో నేను కాసేపు' పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, మే 7:కనుమరుగవుతున్న మానవ, కుటుంబ సంబంధాలను పునరుద్ధరించటానికి కవులు, సాహితీవేత్తలు ప్రయత్నం చేయాలని తెలుగు విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు సూచించారు. శనివారం రవీంద్రభారతిలో గజల్ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో గజల్ సదస్సు, ఆత్మీయ సమ్మేళనం మహోత్సవంతో పాటు బహర్లలో తొలి తెలుగు గజల్ సంకలనం 'గుల్ బహార్, సుబ్బా జ్యోత్స్నా "నాతో నేను కాసేపు" గజల్ సంపుటిల ఆవిష్కరణలు జరిగాయి. గజల్ సాహిత్య వేదిక అధ్యక్షుడు ఇరువింటి వేంకటేశ్వర శర్మ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఆచార్య నిత్యానందరావు మాట్లాడారు. ప్రతి సమస్యతో పరిష్కారం ఉన్నట్లే గజళ్లతో ఆత్మీయ సంబంధాలు పెంచే ప్రయత్నం చేయాలన్నారు. గజల్ కవి, విశ్లేషకుడు డా॥ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు 'తెలుగు గజల్ ప్రస్థానం తీరు తెన్నులు' అంశంపై ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వాచార్యులు, గజల్ కవి డా॥ ఆచార్య ముకుంద సుబ్రహ్మణ్య శర్మ, యువభారతి అధ్యక్షుడు డా॥ ఆచార్య ఫణీంద్ర, కవి, అభ్యుదయ ఓరియంటల్ కళాశాల పూర్వాచార్యులు డా॥బి. జయరాములు మాట్లాడారు. గాయకుడు కేశిరాజు కృష్ణ, కవయిత్రి డా॥ గద్దం శ్యామల పుస్తకాలను పరిచయం చేశారు. తొలుత గజల్ గానలహరి, కవి సమ్మేళనం రసవత్తరంగా జరిగాయి. వివిధ రంగాలకు చెందిన వారికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు.

# దేశభద్రతకే తొలి ప్రాధాన్యం

## సైనికులకు సంఘీభావంగా రేపు ర్యాలీ: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 7: పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత



సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయాలకు తావు లేదని, మన దేశ భద్రతే ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత వివిధ విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యవసర సర్వీస్ లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తూ ఈ సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకున్నారు.

పాకిస్థానీయులు, బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకోవాలి

రాష్ట్రంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. ఉద్యోగులు, మంత్రులందరూ అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని ఇలాంటి వాటిని ప్రచారం చేసే వారిపైన ఉక్కుపాదం మోపాలన్నారు. ఫేక్ న్యూస్ ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్స్ అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర మెడిసిన్, ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని, బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిలువలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని శాంతి భద్రతల కు భంగం కలుగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూం కి అనుసంధానం చేయాలన్నారు. హైదరాబాద్ లోని అన్ని విదేశీ రాయభార కార్యాల యాలు, ఐటీ సంస్థల వద్ద భద్రత పెంచాలని సూచించారు. హైదరా బాద్ నగరంలో పోలీసులు అప్రమత్తం గా ఉండాలన్నారు. సైబర్ సెక్యూరిటీ మీద దృష్టి సారించాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే పీస్ కమిటీ లతో మాట్లాడాలని హిస్టరీ షీటర్ లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ డిపార్ట్ మెంట్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

### సైన్యానికి సంఘీభావంగా రేపు ర్యాలీ

దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇచ్చేలా భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఇతర నేతలు హాజరుకానున్నారు.

### ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు

భారత భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడని రేవంత్ రెడ్డి అన్నారు. భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రతి పౌరుడు ఆర్మీకి అండగా ఉండాలని పిలుపునిచ్చాడు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తను బాధ్యతలు తాను నిర్వర్తిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పార్టీలను పక్కకు పెట్టి ఒక్కటిగా ఉండాల్సిన సమయం ఇది అని అన్నారు.

భారత రక్షణ రంగంలో హైదరాబాద్ పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో శత్రు దేశం దాడి చేస్తుందన్న సంకేతాల మేరకు రాష్ట్రంలో అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని రేవంత్ రెడ్డి అన్నారు.

## నాట్కో హైస్కూల్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మే 7:కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నాట్కో జిల్లా ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై పాఠశాల భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. నాట్కో పరిశ్రమ నిర్వాహకులు సీఎస్ఆర్ నిధులతో కొత్తూరు ఉమ్మడి మండల ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం అందించటం కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పుష్కర కాల సాహిత్య సేవ



-పి.బదేసాబ్

ప్రతి నదికీ పన్నెండేళ్లకోసారి పుష్కరా లొస్తాయి. తెలుగు సాహిత్య అభిమానులను సాహిత్య మధురస ప్రవాహంలో ఓలలాడిం చిన ఆ నదికీ ఇప్పుడు పుష్కరాలొచ్చాయి. ఈ నెల ఎనిమిదో తేదీన పుష్కరకాల మహోత్సవా లను నిర్వహించుకుం టోన్న ఆ నది తెలుగు భాషా చైతన్యసమితి.

ప్రస్తుత జోగులాంబ గద్వాల జిల్లా వడ్డే పల్లి మండలం రామాపురం గ్రామానికి చెం దిన ప్రముఖ సాహితీవేత్త బదేసాబ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా 2013లో తెలుగు భాషా చైతన్యసమితి ఏర్పాటైంది. సారస్వత పరిషత్తు పూర్వ విద్యార్థి అయిన బదేసాబ్ పరిషత్తులో విద్యాధ్యయన సమయంలో పొందిన స్ఫూర్తితో 'తెలుగు భాషా చైతన్యసమితి' పేరుతో గత పన్నెండేళ్లుగా అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థకు రాష్ట్ర అధ్యక్షులుగా బి. వేంకటేశ్వర్లు, సలహాదారుగా రాజగోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా డా. ఎడ్ల కల్లేష్, పెబ్బేటి మల్లికార్జున్ వ్యవహరిస్తున్నారు. ప్రముఖ సాహితీవేత్తలు డా.వి. జయప్రకాశ్, దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు రామకృష్ణ చంద్రమౌళి తదితరులు సంస్థ కార్యక్రమాల్లో చురుకైన భూమిక నిర్వహిస్తున్నారు.

తెలుగు భాషాచైతన్య సమితి ఒకవైపు భాషాసాహిత్య ప్రచార, అవగాహనా కార్యక్ర మాలను నిర్వహిస్తూ మరోవైపు గ్రంథ ప్రచురణ కూడా చేస్తోంది. 'కావ్యగానం', 'కావ్యపఠనం', 'కొత్తపుస్తకం' అనే పేర్లతో విస్తృతంగా కార్యక్ర మాలను నిర్వహిస్తోంది. అంతే కాకుండా బాల సాహిత్యంతో పాటు భాష, సాహిత్య, వ్యాకరణాది అంశాలను సాహిత్యాభిమానులకు చేర్చేందుకు కృషి చేస్తోంది. 'కావ్యగానం' కార్యక్రమ పరంపర 2020 సెప్టెంబరు 27న డా. ఏనుగు నరసింహారెడ్డి రాసిన 'తెలంగాణ రుబాయిలు' గ్రంథంతో ప్రారంభమైంది. మొదట్లో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది పూర్తయిన అనంతరం ప్రతి నెల మొదటి ఆదివారం ఈ కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. ఈ పరంపరలో కె. శివారెడ్డి, డా.నందిని సిధారెడ్డి, డా.అమ్మంగి వేణుగోపాల్, పెన్నా శివరామకృష్ణ, డా. కూటికుప్పల సూర్యారావు, డా. టి. గౌరీశంకర్, మామిడి హరికృష్ణ, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, దేశపతి శ్రీనివాస్, కొండేపూడి నిర్మల, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, స్వాతీ శ్రీపాద మొదలైన 66మంది సుప్రసిద్ధ కవుల కావ్యగానాన్ని తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి సమాంతరంగా ప్రతి రెండో ఆదివారం 'కావ్యపఠనం' పేరుతో మరో కార్యక్రమ పరంపరను కూడా తెలుగు భాషాచైతన్య సమితి చేపట్టింది. నవీన్ రచించిన 'అంపశయ్య' నవలతో 2021 అక్టోబరు పదో తేదీన ఈ కార్యక్రమ పరంపర ప్రారంభమైంది.

అల్లం రాజయ్య రాసిన 'కొలిమంటుకున్నది', డా. పసునూరి రవీందర్ రచించిన 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా', జింబో వెలువరించిన 'జింబో కథలు' మొదలైన 14 గ్రంథాలపై కావ్యపఠనం సాగింది.

'కొత్తపుస్తకం' శీర్షికతో కొత్తగా వచ్చిన గ్రంథాలను పరిచయం చేసే కార్యక్రమం శీలం భద్రయ్య రచించిన 'లొట్టపీసు పూలు' గ్రంథంతో 2021 సెప్టెంబరు 10న ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రతినెల మూడో ఆదివారం నిర్వహించింది తెలుగు భాషాచైతన్య సమితి. డా. పురుషోత్తమాచార్య 'సింహగిరి వచన సంకీర్తనలు', డా. ఏటుకూరి ప్రసాద్ 'జనం నుంచి జనం లోకి', వనపట్ల సుబ్బయ్య 'సెల్ఫ్ లాక్ డౌన్' తదితర 22 గ్రంథాలను ఈ శీర్షిక కింద పరిచయం చేశారు.

ప్రతినెలా మూడో ఆదివారం తెలుగు భాషాచైతన్య సమితి నిర్వహించిన మరో కార్యక్రమం బాలసాహిత్యంపై 12 మంది బాలసాహితీవేత్తల ప్రసంగాల పరంపర. 'బాల సాహిత్యం: గతం, వర్తమానం, భవిష్యత్తు' అనే అంశంపై చొక్కాపు వెంకటరమణ ప్రసంగంతో ఈ కార్యక్రమ పరంపర 2021 అక్టోబరు 24న ప్రారంభమైంది. డా. వీఆర్ శర్మ, సువర్ణ వినా యక్ తదితరుల ప్రసంగాలు ఈ కార్యక్రమంలో భాగంగా జరిగాయి.

తెలుగు వ్యాకరణంలోని వివిధ అంశాలను తీసుకుంటూ అవగాహన ఏర్పరచిన గొప్ప పాఠాలను తెలుగు భాషాచైతన్య సమితి 2020 నవంబరు 8వ తేదీన మోతుకూరి నరహరి ప్రసంగంతో ప్రారంభించింది.

ఇందులో భాగంగా డా. డి. చంద్రశేఖర్ రెడ్డి, డా. ఆలేటి మోహన్ రెడ్డి, ఆచార్య దావులూరి కృష్ణకుమారి, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య ఉషాదేవి తదితరులు వ్యాకరణ పాఠాలు బోధించారు. ఈ పరంపర 63 వారాల పాటు కొనసాగడం విశేషం.

పై కార్యక్రమాలే కాకుండా వివిధ ప్రక్రియలపై అవగాహన కార్యక్రమాలను కూడా తెలుగు భాషాచైతన్య సమితి నిర్వహించింది. 'హైదరాబాదు విషాదం' తదితర గ్రంథాల అనువాదకులు, ప్రముఖ కవి, విమర్శకులు డా. ఏనుగు నరసింహారెడ్డితో 'అనువాదకునితో ముఖాముఖి' అనే పేరుతో అనువాదకుడితో సంభాషించే అవకాశం కల్పించింది. వివిధ గ్రంథావిష్కరణలు నిర్వహించింది.

తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో దాశరథి శతజయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను కూడా తెలుగు భాషాచైతన్య సమితి నిర్వహిస్తూ వస్తోంది. 'దాశరథి సాహిత్య సమాలోచన' అనే అంశంపై ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి ప్రసంగంతో గత ఏడాది నవంబరు 16వ తేదీన ఈ కార్యక్రమాలు మొద లయ్యాయి. ఆచార్య చెన్నకేశవరెడ్డి, గిరిజామనో హర్ బాబు, డా. సి. వీరేందర్ తదితరుల ప్రసంగాలతో జరుగుతోన్న ఈ కార్యక్రమ పరంపరలో ఇప్పటివరకు 25 భాగాలు పూర్తయ్యాయి.

భాషాసాహిత్య అంశాలపై అవగాహనతో సరిపెట్టకుండా సాహిత్య సృజనకు కూడా తెలుగు భాషాచైతన్య సమితి దోహదం చేస్తోంది. ఇప్పటివరకు 15 గ్రంథాలను ప్రచురించింది. ప్రముఖ సాహితీవేత్త డా.వి. జయప్రకాశ్ సంపాదకత్వంలో 'సాహిత్యంలో సహస్రబాహుడు' అనే పేరుతో ఒక గ్రంథాన్ని వెలువరించింది. 'భాస్కరోదయం' పేరుతో డా.ఎస్.విజయభాస్కర్ కవితాసంపుటిని ప్రచురించింది. వివిధ సందర్భాల్లో కవితాసంకలనాలను వెలువరిం చింది.

పుష్కర కాలంగా సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోన్న తెలుగు భాషాచైతన్య సమితి ఈ నెల ఎనిమిదో తేదీన పన్నెండవ వార్షికోత్స వాన్ని నిర్వహించుకుంటోంది.

సాహిత్య కార్యక్రమ విజయపరంపరను ఇలాగే కొనసాగిస్తూ మరిన్ని కార్యక్రమాలకు తెలుగు భాషాచైతన్య సమితి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

సాహిత్య మధురిమను భవిష్యత్ తరాలకు పంచుతోన్న తెలుగు భాషాచైతన్య సమితి బృహత్తర యజ్ఞసేవ నిర్విరామంగా, నిర్విఘ్నంగా జరగాలని తెలుగు భాషా సాహిత్య అభిమానుల ఆకాంక్ష.

-డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

**చురక**

అప్పులతో రాష్ట్రం
ఆర్థికంగా దుస్థితి
ఎవరి పాలనైతేనేమి
ఎందుకొచ్చే ఈస్థితి
వడ్డీలకే వేల కోట్లు
వెచ్చించే పెను భారం
గతం వారసత్వంగా
కొనసాగే ఈ ఘోరం



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం- నేటికి అందం**

కలిగించి రక్త హీనత
నలవోకగ ప్రాణములకు హాయిని చెరిపే
తలసేమియాను ప్రజలకు
విలువలతో జెప్పవలయు విశదము గాగన్

(8-5-25 తలసేమియా అవగాహనా దినం)



-రాధశ్రీ
సెల్:9494481210






నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 8-5-2025

## పున్నా శతకం



**అ**తి వాగుడు అతి నిద్రయు
అతి ధనసంపాదనమును అతిమోహంబున్
అతి లోభము అతి సంతతి
మతి చెడి తిరుగుచును యుండు మహిలో పున్నా.

**శృ**తి లేని రాగమెందుకు?
సుతిలేని జీవితమందు సుఖముందదురా
గతిలేని మాలెందుకు?
మతిలేని మనుగడలేల మహిలో పున్నా

\- పున్నమి
సెల్:92464 10639

## ఘంటారావం



**వ**యసు
వాడిపోతుంది
సొగసు
వీడిపోతుంది.

**ఒ**క్కసారి వెనక్కి
వీక్షించు
చేసిన తప్పుల్ని
సమీక్షించు

**శ్ర**మయే
ధర్మం
శ్రమయే
దైవం

**ని**యంత్రణ పాటిస్తే
పథ్యం
వికటిస్తే
పైత్యం

**గౌ**రవించటం లేదని
గగ్గోలు పడకు
వేషభాషలు హుందాగా
ఉండాలని మరువకు

\-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
\-కందుకూరి శ్రీరాములు
\-బెల్లంకొండ సంపత్ కుమార్

## హిమగిరి సొగసులు...

**హి**మగిరి సొగసులు
మరిగించెను మనసులూ...
హిందువైనా- తురకలైనా
మనషులనే మాట మరచి,
హింసించెనూ...
హిమగిరి సొగసులూ...
ఏడు పదులైనా..
ఎన్నేండ్లైనా మారని మారణ హోమం..
కలిసిమెలసి ఉండలేని
కక్ష్యపూరిత దాయాదులూ
కల్మష హృదయులు...
మానవత్వమే మరిచేనా,
హిమగిరి సొగసులూ
కలచి వేసెను గుండెనూ!!
ఈ గిరులలో మునులెందరో
శాంతి పాఠాలు వల్లించిరీ...
తరతరాలుగా వినివిని
నరనరాన జీర్ణించుకుంటిమీ!
తల్ వార్ లతో- తలలే నరికీ,
తూటాల కేళీలో శవాలు రక్తాన తేలియాడె!
హిమగిరి సొగసులూ.. శోకింపచేసె!
ప్రతి కంటా జీలం నదులే
కన్నీరై పారెనూ...
హిమగిరి సొగసులూ
మురిపించుతాయన్నారే?.
కొత్తజంటల కువకువలతో..
బతుకు పండిన నడివయసులలో
ఆ ఆనంద డోలల తేలేదెన్నటికో?
బాలల కేరింతలే రోదన
ధ్వనులుగ మారిన గిరులూ...
అభమూ శుభమూ తెలియని పౌరులే...
జాతీయ జెండా చుట్టుకొని
అమరజీవులైన వేళ...
హిమగిరి- అగ్ని గోళముగ మారే!
ఆత్మీయుల అగచాట్లే లావాలై పొంగి...
అగ్ని పర్వతమై మారిన గిరులు..
మృత్యు కుహరములైన వేళ!
భాధితుల కన్నీరే
జీలం నదిగా వారిని ముంచెత్తె!
ఎవరు చేసిన ఖర్మ వారనుభవించక
ఏనాటికైనా తప్పదన్నా!!

\-రంగరాజు పద్మజ.

## రక్త తర్పణం

**క**నువిందు చేస్తున్న కాశ్మీరపు అందాలు
ఎర్రతివాచి పరిచి రారమ్మంటుంటే
ఆతృత నిండిన మది
కొత్తందాల మోజులో
మంచు కొండలవైపు
పయనమైన ఫలితం...
కరుడుగట్టిన రాక్షసత్వం ఆయుధాలు
చేతబట్టి
తూటాలతో
మారణ హోమం చేస్తుంటే...
కొత్తజంట కోటి ఆశలసౌధం పారాణి
తడి ఆరకముందే
నేల కూలిన క్షణాలు
కళ్ళముందే
కడతేరిన దాంపత్యబంధంతో
పొత్తిళ్లలో చిన్నారితో దిక్కుతోచని
ఇల్లాలి మిన్నంటిన రోదనలు.
మరుభూమిలో పారే రుధిర ధారల
నడుమ ప్రాణభిక్షకై పడతుల
ఆక్రందనల హోరుతో
దిక్కుతోచని జనం గుండెలవిసేలా
హాహాకారాలతో దౌడు తీస్తుంటే.
నేలనంటిన మృతాంగాలను చూసి
సమాజం స్థాణువైపోయి
మానవతావాదం సిగ్గుతో తలవాల్చితే
హిమపాతం కరిగి అశనిపాతమైందా
జీలం నది గౌరవర్ణం
పులుముకుందా
పర్యాటకం పరిహాసమైందా
భద్రత భ్రాంతిలా మారిందా?
మతమౌఢ్యం వేళ్ళూనుకుని
పైశాచికత్వం ఒళ్ళు విరుచుకుంటే
రావణ కాష్టం రగులుతూనే ఉంటుంది

\-రాధికాసూరి

## చేను మేసిన కంచె

**అ**దుపు తప్పిన విచక్షణలో అమ్మతనం భూస్థాపితం
పడగ విప్పిన కామానికి పేగు బంధం అతీతం కాలేదు
దిగజారిన బతుకులకు చిరు మొలకలు మినహాయింపు కాలేదు
ఆధునిక మోజులో పెరటి మొక్క వైద్యానికి పనికి రాలేదు
పడవ నడిపే సరంగు కంటికి నచ్చలేదు
చెమటోడ్చే చోదకుడిని మనసు మెచ్చలేదు
మనుగడ కోసం సాగే పోరులో అంగరక్షకుడి అప్రమత్తత కరువైంది
చీర కుచ్చిళ్ళలో దోబూచులాడిన బాల్యానికి ఊయలే ఉరితాడైంది
అద్దంలో అమ్మతనం జడలు విప్పి వణికించింది.
సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది
అంతలోనే తేరుకుని కొరడా ఝుళి పించింది
తులసి వనమంటి స్త్రీ జాతిలో మొలిచిన గంజాయి మొక్కలు
అమృతభాండమంటి అమ్మతనంలో ఒలికిన విష బిందువులు

\-పద్మశ్రీ చెన్నోజ్వల

## ప్రభాకరుడు

**స్నే**హమే
ప్రాణమైన వాడు
ఉద్యమమే
ఊపిరైనవాడు
సామాజిక సమస్యలకు
స్పందన ఆయన నైజం !
హక్కుల పోరాటానికి
అందరికన్నా ముందడుగు !.
కవిగా
వక్తగా
అందరి మనల్ని పొంది
చీకట్లను పారదోలే
వెలుగు రేఖ .
సార్ధక నామధేయుడు
ప్రభాకరుడు
నా సహాధ్యాయి
కవితా ప్రియుడు
రసహృదయుడు
క్లాస్మెట్ గా కొన్ని రోజులే అయినా
ఎల్లప్పుడూ గుర్తుంచుకోవలసిన
ప్రేమ హృదయుడు
గొప్పవ్యక్తి
గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాడు
మంచి కవిత్వాన్ని ప్రేమించినవాడు
నా అభినందనలు !!

\-కందుకూరిశ్రీరాములు

## ముసలం

**భా**రతావని ముద్దు బిడ్డల
అమాయకుల ఉసురులు
గాంధారి శాపమై
దుర్వాస ముని వాక్కులు
సాంబుని కడుపున
ముసలం బుట్టి
వంశ నాశనం బొనరించినట్లు
ఉగ్రవాద ముష్కరులకు ఉచ్చువ్వాలి
వాని వేళ్లే వాని కళ్ళు పొడవాలి
పెంచి పోషించిన ఉగ్ర రక్కసి
భస్మాసుర హస్తం బై
ఉగ్రవాద ముష్కర మూకల
వంశ వారసత్వం అంతా
భస్మీ పటలం అవ్వాలి !

\-పట్లోళ్ళ బక్కారెడ్డి

## నానీలు

**నా**నీ అనే
నాన్న పిలుపు
నవ నాడులకు
ఉత్తేజపు మలుపు

**నా**న్నంటే
దైన్య మెరుగని ధైర్యం
నాన్నంటే
ధర్మ మెరిగిన కర్మయోగం

**జీ**వన గమనం చూపే
మార్గదర్శి
కులమత చూపని
సమదర్శి

**నా**న్న అడుగులు
సంస్కారపు జాడలు
నాన్న నుడుగులు
రాచ మార్గాలు

**ఆ**కాశపు ఔన్నత్యం
నాన్న వ్యక్తిత్వం
సూర్యుని తేజస్సు
నానాని వర్చస్సు

**మ**హోన్నత యశస్వి
సేవా తపస్వి
చతుర వచస్వి
సుమనస్వి



\-డా.నమిలికొండ సునీత
9908468171

# గిరిజనుల స్థితిగతులు మార్చాలి

### -మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగరరావు
### -పాశం యాదగిరికి శ్రీధర్‌రెడ్డి పురస్కారం

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో గిరిజనుల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. వారికి చెందిన భూములు అన్యాక్రాంతమై వా రు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొం టున్నా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలేదన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి పురస్కారాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, పాత్రికేయుడు పాశం యాదగిరికి గురువా రం ప్రదానం చేశారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూ రి శివారెడ్డితో కలిసి పాశం యాదగిరికి 25వేల నగదు, జ్ఞాపిక అందజేశారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తాను మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు రాజ్యాంగం లోని ఐదవ షెడ్యూల్‌ను అమలు చేసి గిరిజనుల స్థితిగతులు మార్చానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా తెలుగు భాష బతికిఉండడం సంతోషించదగిన విషయమన్నారు. పురస్కార గ్రహీత పాశం యాదగిరి పర్యావరణ న్యాయం అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మీ, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




పాశం యాదగిరికి పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, తదితరులు

# బంధాల కథలు -బందారం కథలు



**సా**హిత్యంలో కథ ఒక శక్తివంతమైన ప్రక్రియ. ఈ ప్రక్రియను గ్రామీణ ఆత్మతో తనదైన శైలిలో సమర్థవంతంగా 'బందారం కథలు' పేరుతో డా. నందిని సిధారెడ్డిగారు రాశారు. ఇవి కేవలం బందారం గ్రామ కథలే కాదు. మన అందరి ఊరి కథలు కూడా. ఈ కథల నిండా తెలంగాణ అస్తిత్వమూ, తెలంగాణ గ్రామీణ జీవభాష నిండుగా పరుగులు తీస్తుంది.

వస్తువులు కథలు పరిసరాల నుంచి పుట్టుకొచ్చినవి. అత్యంత సహజమైనవి.

పల్లెల్లో పుట్టి పెరిగిన వారికి ఈ కథలు చదువుతున్నప్పుడు సంఘటనలు, సన్నివేశాలు, పాత్రలు, వైరుధ్యాలు వైవిధ్యాలు అన్నికూడా అనుభవాలుగానో అనుభూతులుగానో తప్పక గుర్తుకు వస్తాయి. పట్నాలలో లేని మానవీయ బంధం సమిష్టి జీవనం పల్లె కథల్లోఉంటుంది. అదేవిధంగా మూఢనమ్మకాలు. మంత్రాలు తంత్రాలు నమ్మకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ ఈ కథల్లోను ఉన్నాయి.మనతో ముచ్చట పెడుతున్నట్టుగా ఉ ంటాయి ఈ కథలు.

మొదటి కథ 'మా ఊరు తీరులో'బందారం గురించి ఊహాతీతంగా అద్భుతంగా వివరిస్తారు రచయిత. కప్పం కట్టని బందారం నుంచి కప్పం ఎల్లాగైనా వసూలు చేయాలని, రాజు సైనికులను పంపితే, ఓ గొర్రెల కాపరి చూసి, తెలివిగా బాటకు అటు ఇటుగా ఉన్న రెండు గుండ్లపై పసరు పిండాడట. సైనికులు పొలిమేరలోకి వచ్చేసరికి ఎగిరెగిరి గుద్దుకుం టున్న గుండ్లను చూసి, భయపడి పలాయనం చిత్తగించారు. ఇక మీసాల మల్లయ్య అతి సాహసవంతుడు ఊరి కోసం సారగమ్మ దేవతను తేవడానికి అడవికి వెళ్ళాడు. ఎంతకు తిరిగిరాని మల్లయ్య పని అయిపోయిందని గ్రామస్తులు అనుకుంటున్న సమయంలో, నివ్వెరపోయే అనూహ్యమైన అద్భుతమైన ఘట్టం. బండికి వలపల దాపట పులులు గట్టుకొని పాముల పగ్గాలు పట్టుకొని విజయ దరహాసంతో మల్లయ్య వస్తాడు. బొడ్రాయి పక్కన సారగమ్మ దేవతను స్థాపిస్తారు. ఇప్పటికీ

ఈ ఘటన ఊరి వాళ్లను ఉత్తేజితులను చేస్తుందట. కానీ **"ఎవడు పొందిచ్చిండో ఊరు ఎప్పుడు కటకటే"** అనే వాళ్లకు కొదవలేదు అని కథ ముగుస్తుంది. సర్వసాధారణమైన సహజమైన ముగింపు ఇది. ఊరన్నాక సమాజ మన్నాక రకరకాల మనుషులు మనస్తత్వాలు ఉంటాయి కదా!

మనుషులు ధర్మం తప్పినట్టే ఋతువులు ధర్మం తప్పుతున్నాయి. అని మొదలవుతుంది **'చినుకు చినుకుల వాన'** కథ. మూడేళ్లుగా కరువుతో బాధపడుతున్న బందారం ప్రజలు శివుని గుడిని నీటితో నింపాలనుకుంటారు. పిల్లలు రెండు కప్పలు దొరకబుచ్చుకొని కప్పల పెళ్లి చేసి మురుస్తారు. గుడి ప్రాంగణంలో దిగుడుబాయి నుంచి నీళ్లు తోడడానికి ఇంటింటి నుంచి బిందెలు తెచ్చి, అనుకున్నట్టుగానే గుడిని నీటితో నింపుతారు. చాలా ఆసక్తిగా కొనసాగుతుంది కథ. ఇక్కడే కథ మరో ఆసక్తికరమైన మలుపు తిరుగుతుంది. ఎవరి బిందె వాళ్లకు ముట్ట చెప్పే క్రమంలో నడిమింటి మల్లమ్మకు మంచి బిందెకు సొట్ట బిందె వస్తుంది **"ఒకళ్ళ బింద తీసుకున్నోళ్లు గత్తరొచ్చి సావాలే"** అని శాపనార్థాలు పెట్టారు. అది ఊరికి పెద్ద సమస్యగా మారింది. మొత్తానికి ఊరి పెద్దల తెలివైన మంత్ర బియ్యం ప్రమాణంతో, తెలతెలవారుతుండగా శివుని గుడిలో తళ తళలాడింది బిందె. ఊరంతా ఊపిరి పీల్చుకోవడమే కాదు. చదువరులు హాయిగా ఊపిరి పీల్చుకొని సంతృప్తిగా నవ్వుకుంటారు. కష్టాలు వచ్చినప్పుడు కలసికట్టుగా శుభాలు జరగాలని ప్రకృతిని దైవాన్ని కాలాన్ని వేడుకోవడం జానపదులకు సర్వసాధారణం.

మరో కథ **'ఋణానుబంధాలు'** పశువులను ప్రాణంగా ప్రేమించే పల్లె మనసు కనిపిస్తుంది. బిడ్డొచ్చిన వేళ గొడ్డొచ్చిన వేళ అంటారు కదా! పెద్ద షావుకారికి కలిసొచ్చిన ఆవు లక్ష్మి చనిపోయినప్పుడు సంప్రదాయకంగా ఊరే గింపుగా శవయాత్ర చేయడం,ఈ సందర్భంగా ఊరి వాళ్ళు రకరకాలుగా






దా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

ఇవి కేవలం బందారం గ్రామ కథలే కాదు.
మన అందరి ఊరి కథలు కూడా.
ఈ కథల నిండా తెలంగాణ అస్తిత్వమూ,
తెలంగాణ గ్రామీణ జీవభాష నిండుగా పరుగులు తీస్తుంది

స్పందించడం ఈ కథ. ఈ కథలోనూ ఓ మలుపు సస్పెన్స్ ఉంటాయి. ఓ పండు ముసలమ్మ శవయాత్రకు వస్తుంది. **'ముసల్దానికేం పనిలేదు చాతకాకున్న ఏంటోస్తది'** అని అందరూ అనుకున్నా, అతి కష్టంగా కట్టే పట్టుకొచ్చి కాష్టం మీదేసి మొక్కుతుంది.

ఇంతకీ ఈ ముసలమ్మ ఎవరు? ఈ అనుబంధమేమిటి? ఎప్పుడో ఈ ముసలమ్మ అవ్వ చావు బతుకుల్లో ఉంటే సుడితో ఉన్న ఆవును సావుకారికి కుదువ పెట్టింది. ఆ ఆవుకి పుట్టిన తొలిచూరు బిడ్డ ఈ లక్ష్మీ పేరు గల గోవుమాలక్ష్మి.

మరో మంచి కథ **'కుంజి'** అత్త ఆరళ్ళు తల్లి చాటు భర్త ఆంజనేయులుతో కాపురం చేయలేక కమల పుట్టింటికి వెళ్తుంది. బతుకమ్మ పండుగ రోజుల్లో పువ్వు కోసం వెళ్లిన కమలా, కమల స్నేహితులు ఆంజనేయులును చూస్తారు. ఇక్కడ వీరి సంభాషణ లోకజ్ఞానం ముచ్చటగా అనిపిస్తుంది. పెళ్ళాం అక్కరలేదా అని అడిగితే కావాలి ఎందుకోద్దు అంటాడు. కమల దోస్తులు చేతులు కట్టి ఆంజనేయులును గుంజుకుపోతారు. అత్తగారింట్లో చక్కగా కాపురం చేసుకుంటుంటే తల్లి పెద్ద మనుషులతో వచ్చి పంచాయతీ పెట్టిం ది. అందరూ నచ్చ చెప్పాక ఆఖరికి తల్లి కూడా వాని బుద్ధి వాని కాపురం అంటుంది. అయినా కూడా ఆంజనేయులు అమ్మ ఎట్లా అంటే అట్లనే అంటాడు.

ఇక భరించలేక కమల గొంతు విప్పుతుంది. **"ఈన తోని కాపురం ఇసుకతోని తాడు పేని నట్టు"** నాకు మొగుని కాపురం కావాలి అత్త కాపురం వద్దే వద్దని చెప్పేస్తుంది. ఆమె మాటల్లో న్యాయం మధ్యవర్తుల నోరు కట్టేస్తుంది. ఉదాత్తంగా ఉన్నతంగా స్వాభిమానంగా ఆమె కనిపిస్తుంది. సొంత ఆలోచనలు లేని భర్తలకు ఆమె మాటలు చెంపపెట్టు. భావితరాలకు సమాధానంగా నిలిచే ధైర్యం ఆమె మాటల్లో వ్యక్తమవుతుంది.

ఇదే విధంగా జాయి జాదు కథలో జానమ్మ, యశోద వెంట కథలో యశోద, గట్టి మనిషి కథలో కిన్నెర ఎల్లవ్వ దర్పంగా హుందాగా సాధికారంగా ఉండే స్త్రీ పాత్రలుగా మనకు కనపడతారు.

జంజాటం కథలో అమాయకమైన స్త్రీలు కనబడతారు. ఏ పని చేయకుండా స్వార్థపరుడుగా తత్వాలు పాడుకుంటూ భార్యాపిల్లల బాధ్యతను మరిచి, ఊరు విడిచి వెళ్లిన రామనర్సయ్యను అతి కష్టం మీద జాడ తెలుసుకొని ఉ త్తరాలు రాయించి ఇంటికి వచ్చేలా చేస్తుంది భార్య చంద్రవ్వ. కాషాయ బట్టలతో ఓ స్త్రీని వెంట బెట్టుకొని వచ్చినా భరిస్తుంది. ఇద్దరి గొడవలతో మళ్లీ రామనరసయ్య ఊరుడిసిపెట్టి వెళ్తాడు. మళ్ళీ ఇద్దరు ఆడోళ్ళు సర్దుకుపోయి సామర స్యంగా పనిచేసుకుంటూ, పిల్లల్ని చూసుకుంటూ బతుకుతారు. మరో ఏడాదికి రామనర్సయ్య జాడ తెలుసుకొని, ఇంటికి రమ్మని ఉత్తరాలు రాస్తారు. ఈసారి మళ్లీ అవే కాషాయ బట్టలతో, ఏక్తారా మీటుకుంటూ, ఓ ఆడమనిషితో వస్తాడు. ఇదే ఈ కథకు ముగింపు. రామ నర్సయ్య బాధ్యతా రాహిత్యం మీద మనకుఏవగింపు కలుగుతుం ది. ఇలాంటి వాళ్లు సమాజంలో ఎందరో...?

మరో మంచి కథ **'శానతనం'** పీర్ల పండుగను కళ్లకు కట్టినట్టు అద్భుతంగా చిత్రించిన కథ. ఇందులో కొమురెల్లి మానసిక వేదన సంఘర్షణ ఉంటుంది. ఎంత పని చేసినా, ఎవరి మెప్పు ఉండదు. ఊరంతటికీ సత్య లింగం సేటు లోకువ. ఆ సత్య లింగానికి కూడా తాను లోకువ. అరుగు మీద కూసోనీయడు. దుకాణం ఎదురుగా చింతమొద్దు మీదా కూసోనీయడు.

అలువాగుండం మండుతుంది. వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని, తనను చింతపెట్టిన చింత మొద్దుని అందులో వేస్తాడు కొమురెల్లి. తన గుండె మంటను బాధను కొంతైనా ఖాళీ చేసుకుంటాడు. అంతర్లీనంగా ఓ మౌన విప్లవంగా ఈ కథ ముగింపు ఉంటుంది.

మనసు పాడుగాను మనసు కథలో బాల్య వితంతు వజ్రమ్మ లైంగికమైన కలగని కలతపడు తుంది. తనకు తోచిన పద్ధతిలో ఓ చిన్న పిల్ల వాని చేత చాతిపై తన్నించుకొని ప్రాయశ్చిత్తం చేసుకుంటుంది. ఈ కథను విశ్లేషించాలంటే నాటి కాలమాన పరిస్థితులను బట్టి మనస్తత్వాలను బట్టి, భిన్న కోణాల్లో పరిశీలిం చవలసి ఉంటుంది. ఆ విశ్లేషణ కూడా వారి వారి మనస్తత్వాలను బట్టే ఉంటుంది.

చెడ్డ గడియ కథలో జయమ్మ చనిపోతే, జయమ్మ తాలుకు మనుషులు మంత్రాలు నేర్చిన పాపయ్యే కారణమని, మంత్రగాడని అమానుషం గా హింసించి చంపేస్తారు. నిండు ప్రాణాన్ని మూం ఢత్వం బలిగొంటున్న ఊరు ఊరంతా చూస్తుందే తప్ప ఎవరు ఏమి చేయరు. చంపిన వాళ్ళు జైలు కెళ్తారు. **'గడియ.ఒకోగడియ'** అని కథ ముగుస్తుంది.

ఉన్నది లేనిది కథలో ఊరికి ఎంతో ఉపకారం చేసే పాపయ్య షావుకారు ఊరి విడిచి వెళ్తుంటే, ఊరంతా బాధపడ్డది. ఊరు విడిచి వెళ్లొద్దని బతి మాలింది. పాపయ్య దుకాణానికి పోటీగా ఊరిలో మరో దుకాణం వచ్చింది. పాపయ్య ఇక ఊరిలో ఉండలేకపోయాడు. ఎంత మంచి వాళ్లకైనా పోటీ దారులు ఉంటారన్నది సర్వసాధారణమైన విషయం.

**నన్నే జీవులు** కథ ఈ సంపుటిలోని చివర కథ.ఇది గుండె లోతుల్ని తడిమే కథ. మానవ విలువలు పెంచే కథ.

ఈ కథలో అంతయ్య కష్టాలు రత్నవ్వకు, రత్నవ్వ కష్టాలు అంతయ్యకు తెలుసు. సందర్భాలు వేరువేరైనా ఒకరి కష్టాల్లో ఒకరు ఓదార్పు అవు తారు. అంతయ్య ఇల్లరికం అల్లుడు. వడ్ల పని చేసి అలసిపోయి ఉన్నా కోపేడుచాయ కూడా పోయరెవరు. హీనంగా చూస్తుంటారు. రత్నవ్వేమో భర్త కోపాన్ని మాటలను భరించలేకపోతది ఆమెకు బతుకు మీద విరక్తి కలిగింది.

పిల్లలతో బావిలో దూకి ఆత్మహత్య చేసు కో బోతే అంతయ్య కాపాడాడు. ఒక సందర్భంలో అంతయ్య ఉరేసుకోబోతే రత్నవ్వ కాపాడింది. ఇద్దరు కూడా విరక్తి నుండి బయటపడి ఆత్మహత్య ప్రయత్నాలు మానేస్తారు. బతుకు మీద ఆశ కల్పించే సందేశం ఈ కథలో ఉంటుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ కథల సంపుటిలో ఉన్న 24 కథలు అద్భుతమైన కథలు. వేటికవే ప్రత్యేకమైనవి.

**సిధారెడ్డి గారు తన పల్లె జీవనానుభవాలను, జ్ఞాపకాలను అందంగా కళాత్మకంగా మలిచారు. సందర్భానుసారంగా, పాటలు మాటలు పద్యాలు సామెతలను కూర్చారు. వ్యవసాయక జీవితాన్ని పల్లె జీవన విధానాన్ని కథలలో చక్కగా పొదిగారు.**

ఉన్నది ఉన్నట్లుగా సజీవ పాత్రలుగా కళ్ళముందు నిలిపారు.

ఇవి మనల్ని కదిలిస్తవి. చదివిస్తవి. 50 ఏళ్ల నాటి పల్లె జీవితంలోకి మనల్ని ప్రేమగా తీసుకె ళ్తాయి. ఊరంతా తిరిగి చూసే అవకాశాన్ని మనకు ఈ కథలు ఇస్తవి. చదివిన వారికి ఒక మంచి కథల పుస్తకం చదివామన్న తృప్తి తప్పక కలుగు తుంది.

**"మానవ సంబంధాలు ప్రాణ ప్రాణంగా తాకుతుంటాయి"** అని తన మాటల్లో చెప్పుకున్న రచయిత ఈ బంధారం కథలను ప్రాణంగానే అందించారు. 'ఇంకా ఒడవలేదు కుదిరితే మరో వరస' ఆ వరుస కూడా త్వరగా రావాలని కోరుకు ందాం. ఇంత మంచి జీవిత కథలను అత్యంత సహజ సుం దరంగా అందించిన డా॥ నందిని సిధారెడ్డి గారికి అభినందనలు.



\- గడ్డం సులోచన
7702891559

పుస్తక సమీక్షలు



# మంచి కథలకు 'గ్రీన్ సిగ్నల్'

**ఇ**ప్పటి వరకు సుమారు 600 కథలు 9 కథా సంపుటాలు 3 కవితా సంపుటులు మనకందించి, పలు కథా సంపుటాలకు సంపాదకత్వం వహించి తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన రచయిత వడలి రాధాకృష్ణగారి కథల్లో సమాజం, మనుషుల వ్యవ హార శైలి సముద్రమంత లోతయినదై కనిపిస్తుం ది. మానవ జీవితాను బంధాలను అతి సహజంగా అత్యంత ప్రత్యేకతల తో తనదైన 'కన్నుకోణం'తో గమనిస్తూ రాయటం వీరి ప్రత్యేకత. సామాన్యుడు గమనిస్తూ అంతగా శ్రద్ధ పెట్టని అంశాలను సృశిస్తూ ఆ సామాన్యమైన కథలను సృష్టిస్తారు. ఈ ప్రత్యేకతే వీరికి పాఠకాదరణ, పత్రికాదరణ తెచ్చి పెట్టిందంటారు కథా పితామహ శ్రీ విహారిగారు. ప్రముఖ సాహితీ విమర్శకులు 'పాలపిట్ట' పత్రికాధిపతి శ్రీ గుడిపాటిగారు - 'బతుకులోని సంఘర్షణలని చిత్రిస్తూనే మనుషుల్ని సానుకూల దృక్పథంతో అర్థం చేసుకోవాలన్న చైతన్యాన్ని ప్రోది చేస్తాయి' అంటారు. అంతేకాదు, రాధాకృష్ణగారు 'నిజంగా సముద్రమం తటి లోతైన, గాఢమైన సృజనశీలి' అన్న కితాబు నిస్తారు.

ఎన్నుకున్న వస్తువును అతి దగ్గరగా చూపించుతూ, వివరిస్తున్న సన్నివేశానికి పాఠకుడే సాక్షీభూతమై వీక్షిస్తున్న అనుభూతి కలగ చేయటం ఈ రచయిత ప్రత్యేకత.

వడలి రాధాకృష్ణగారిని అతి దగ్గ రగా, గమనించి, గమనిస్తోన్న బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ తిమ్మనశ్యామ్ సుం దర్-వడలి వారికి రాయటం. వ్యస నం అయింది అంటారు ప్రేమతో.




ప్రతులకు:
గోనెళ్ళ శేష వరలక్ష్మి
ఇ.నెం. 1-75,శ్రీ నిలయం, ప్రసాద్ నగర్, వి.ఆర్.ఎస్ & వైఆర్ఎస్ కాలేజీ, వోడరేవు రోడ్, పేరాల పోస్ట్ చీరాల-523 257. బాపట్ల జిల్లా. ఆంధ్ర

20 కథలున్న ఈ 'గ్రీన్‌లైట్ ఏరియా' కథా సంపుటిలో కథలే కాదు, కథల కివ్వబడిన శీర్షికలు సైతం ప్రత్యేకతని చాటుకుంటాయి. రెడ్‌లైట్ ఏరియాను స్ఫురింపచేసే గ్రీన్‌లైట్ ఏరియా 'జాలు వారు జీవితాలు' 'బ్రతుకు ఆవలి జీవితాలు', 'మట్టి ప్రమిద దీపాలు', 'విధ్వంస ధ్వని', 'నల్లనంది వర్ధనం' 'ఓరి నాయనో', 'నీటి నిజం', 'తెల్ల చీకటి', చీకటి చిక్కబ డింది' లాంటి శీర్షికలు వినూత్నంగా ధ్వనించి పాఠకుల దృష్టిని మనసుల్ని ఇట్టే ఆకట్టుకుంటాయి. కథలకు వాడే భాష పాత్రలకిచ్చే పేర్లు, వస్తువుకు అనుకూలంగా, ఉంటూ, కథల్లో ఒదిగిపోతాయి. జాలరులు, సముద్రం మీదికి చేపలవేటకు వెళ్ళే జీవితాల్లోని పాత్రలు.

అక్కిసోములు, గురవమ్మ, ముత్యాలప్ప, పెద్దేలు వంటి పేర్లు కథల్లో సహజంగా ధ్వనిస్తాయి. కథ కొన్ని సంఘటనల సమాహారం అయితే, అన్ని సంఘటనలూ ఒకే తానులోని ముక్కల్లా కలిసిపోవాలి. కాంట్రస్ట్‌గా కథానుకూలతను బట్టి అవి మారినా, అందంగా పొందటంలో రచయిత తన నేర్పును ప్రదర్శించాలి.

ఈ ప్రత్యేకతలన్నీ వడలి రాధా కృష్ణగారి కథల్లో పుష్కలంగా కనిపిస్తాయి. ఈ సుగునాలే రచయితకు ప్రత్యేక స్థానాన్ని ఆపాదించాయి.

జాలరుల భాష, యాసలతో జాలువారు జీవితాలు గురవమ్మ పాత్ర కడు ఉదాత్తంగా చిత్రించ బడింది. భర్త సంతోషం కోసం తాను కర్పూరంలా కరిగిపోవటానికీ వెను కాడలేదు.

కరోనా విపత్తును ఎందరో రచయి తలు తమ కథా వస్తువుగా చేసుకు న్నారు. ఉద్యోగులు, గృహిణులు వ్యాపారవేత్తలు వీరందరినీ కాపాడే డాక్టర్లు కాని ఎవరూ భక్తులు సమర్పిం చుకునే బేడ కానీలతో జీవితం వెళ్ళ దీసే పూజారుల గురించి వ్రాసినట్టు లేదు. గుడిపూజారి వరదాచార్యులుగారిది ఓ అనూహ్యమైన అసాధారణమైన పరిస్థితి, భక్తులను యాచించను లేదు. అలాగని తననూ, తన భార్య ప్రమీలను పస్తులుంచనూ లేదు. భార్య ప్రమీల అనుసరించిన విధానం ఆ ఇద్దరినీ, తాత్కాలికమే అయినా, ఒడ్డున పడేసింది. ఈ 'నిశీధి నీడ' కథలో పూజారి వరదాచార్యులు ఆంతర్యం రచయిత వివరించిన తీరు అద్భుతం. 'అతిశయం తాలూకు వితండం తీవ్ర ంగా ఆయన్ను వెనక్కి లాగుతోందట. 'ఆచార్యం తాలుకు అహం ఓవైపు ఆకలి ప్రశ్నిస్తూ మరో వైపు ప్రశ్నిస్తున్నాయట" చలించి పోవటం, ఉక్రోషాన్ని ఆపాదించుకో వటం, తెలియని భయం ఆవహించి మనసుకు అతలాకుతలం చేయటం, వెన్నులో పుట్టిన జలదరింపు కళ్ళల్లోకి తర్జుమా అవటం, ఒక విము ఖమైన అంతరంగ భావన, అలజడి తాలూకు నిశ్శబ్ద స్పర్శ, విస్తుపోక, వివేకంతో ఆలోచించటం,నమ్ముకున్న వాళ్ళ నమ్మకం విశ్వాసం సడలనీయక పోవటం లాంటి పదాలు, వాక్యాలు పాత్రల్ని సరిగ్గా అంచనా వేసాయి. అంతటి దైన్య స్థితి లోనూ, అర్థాంగి ప్రమీల ఆయన్ని అమ్మ వారి మెడలోని బంగారు గొలుసు తీయనీయక పోవటం- గొప్ప అభివ్యక్తి. ఎంతటి దైన్యంలో కూడా నీతి నియమాలు సడలనీయవద్దన్నా గొప్ప సందేశం ఉంది. కరోనా నేపథ్యంతో వ్రాసిన మరో కథ 'ఇంతలేసి జీవితాలు'. యాదయ్య ఊరి చివరనున్న ఆరామ క్షేత్రంలోని అపరకర్మలు చేయించే శాలలోకి చేరుతాడు. ఎక్కడ ఉండకూడదో అక్కడ ఉండకతప్పడం లేదట! అణగారిన జీవన వాస్తవం యాదయ్య కంటి ముందర సజీవ దృశ్యమవటం, మూసి ఉన్న కిటికీ తలుపు సందుల్లోంచి జొరబడే అనాలోచిత వెలుగు రేఖలు.. యాదయ్య పరిస్థితిని గొప్ప అభివ్యక్తితో వివరించటం.. రాధాకృష్ణ గారికే చెల్లింది.

'గ్రీన్ లైట్ ఏరియా' శీర్షిక చదవగానే రెడ్‌లైట్ ఏరియా స్ఫురణకు వస్తుంది. అవును రాధా కృష్ణగారు వివరించేదీ అదే సంగతి. అదే (రెడ్‌లైట్ ఏరియాలు) కనుక లేకపోతే సంఘంలో ఎంతటి అరాచ కం చోటు చేసుకునేదో, వారు సమా జం కోసం ఎంతటి త్యాగానికి ఒడికడు తున్నారో, సంసారుల శీలానికి 'హంస లక్ష్మి' లాంటి వాళ్ళు ఎంతటి భరోసాయో.. సంసారుల ఇళ్ళలోని ఆడదాని మనుగడకు ఈ రెడ్‌లైట్ ఏరియాలు ఎంతటి రక్షణ కవచంగా ఉంటాయో.. రచయిత చెప్పిన తీరు ప్రత్యక్షరసత్యం. విహారిగారన్నట్లు కథలన్నింటా 'అథెల్టిసిటీ' ఉంది. కొన్ని చదివి కలకాలం దా చుకోవలసిన సాహిత్య సంపద ఇది. అభినందనలు.



\- కూర చిదంబరం
సెల్: 8639338675

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com
E-mail : netinijam93@gmail.com
2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | గురువారం 8-5-2025



ఎన్.అరుణ 1 | మాడభూషిశ్రీధర్ 4 | రాచపాళెం 2 | ప్రొ.కె.వీరారెడ్డి 27 | డా॥ఎస్. గోపి 6 | నిఖిలేశ్వర్ 135




# అమ్మా ఆకాశాలు కవల పిల్లలే!



- డా॥ విద్యాసాగర్ అంగలకుర్తి, ఐ.ఏ.ఎస్.
ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, గిరిజన సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.
సెల్: 9676001230

***2014లో నేటినిజం దినపత్రిక ప్రచురించిన 136 మంది కవుల, కవయిత్రుల 'అమ్మ' కవితా సంకలనానికి ప్రముఖ కవి, రచయిత, సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ విద్యాసాగర్ అంగలకుర్తి రాసిన ముందు మాటను ఈనెల 11న ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా పునఃర్ముద్రితం..***

-సంపాదకులు

అమ్మ అనే పిలుపులో ఉన్నది కవితాగానం కాదూ!తన దగ్గర చెప్పే ప్రతి మాటా ఓ ప్రమాణం కాదూ!మరి అమ్మ మీద కవిత రాయ మనగానే పదాలు వెదుక్కొనే దురవస్థ ఎందుకొస్తోంది?. కవిత్వమంటే అందరికీ అందు బాటులో లేనిదనిపించే భావ నిస్పహాయతా? భావ నిస్సహాయతా? భాష నిస్పహా యతా? భాషా నిస్సహాయతే అనుకుంటాను అందరి మన సులనూ ఏక కాలంలో స్పృశిం చగలిగే విశ్వాన్నంతా ప్రేమిం చగలిగే అప్యాయతాభావనలు వెనక్కి పోతు న్నాయెందుకు?

అమ్మ మనకు మాత్రమే సొంత మ నుకునే సంకుచిత ఆలోచనలు మనస్సునుక మ్మేస్తున్నాయెందుకు? అమ్మ అందరికీ అమ్మ కాగలిగే విశాల విశ్వజనీన భావాలు వ్యక్తం కావెందుకు? నా తల్లి మాత్రమే అలాచే యగలిగిందనే గర్వప్రదర్శన అమ్మతనానికి లేని సంకెళ్లను తగిలించడం కాదూ! ప్రేమ ఎంత విశాలమో అమ్మ మనసంత విశాలం కాదా?

ఎవరినైనా కవిని చేయ గలిగేది అమ్మ మాత్రవేం! వయసులో ఉన్నప్పుడు, ప్రేమ లోపడ్డప్పుడు ప్రతి వాడూ కవి అవుతాడంటారు గానీ పుట్టగానే బిడ్డను కవిని చేసేది అమ్మకాదూ! ప్రేమలో పడేదాకా కవిత్వాన్ని మరిచిపోయామనే కదా అర్థం. అంచేతమనం ప్రేమలో పడగానే కవిని చేసిన ప్రియురాలి కన్నా ముందు తన ప్రేమతో మనల ను కవిని చేసింది మొదట అమ్మే!

**రాయని మధుర భావాలు**
**మానవీయమైన మృధు భాషణ లు**
**కరుణకు పర్యాయ పద మైన కన్న తల్లి చేతి నిమురూ**
**అంతా కవిత్వమే!**

సర్వకాల సర్వ అవస్థల్లోనూ నువు మనిషివే అని వెన్నుతట్టి గుర్తు చేసేది అమ్మ కాదూ! ఆ భావన యింకా యింకిపోలేదు గనకనే మానవజాతి యింకా మనగలుగు తోంది. ఇది కవిత్వం కాకపోతే యింకేది కవిత్వం?అమ్మే కవిత్వం, కవిత్వమే అమ్మ.

---

అమూర్త భావాల నుంచి అమ్మ ను విముక్తురాలిని చేసి రక్తమాం సాలున్న మనిషిగా, తను మనచేత చేయించే సంకల్పాలూ తద్వారా మనం అందుకునే విజ యాలూ మామూలుగా అనిపిస్తూనే ఎంత మహత్తరమైనవో ఒక దగ్గర చూడా లనుందా?

గడ్డి పరకల నుంచి గగన దీపాల దాకా స్థాన బేధాల కతీతురా లిగా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తినింప గలిగే ఫలాపేక్షలేని అమ్మ ప్రేమ రూపాన్ని వైయక్తికంగా అనిపిస్తూనే విశ్వజనీనం చేసిన అమ్మ చెక్కిన విశిష్ట శిల్పాలను చూడాలనుందా?

సూర్యుడు పోసే ప్రాణానికి అసలు వాహిక అమ్మ. సహజ తేజో రాశిని మనలో నింపే కాలనా ళిక అమ్మ అందుకే

'నీ పొట్టలో మరో చిన్న పొట్ట...
దాంట్లో కుదురుగా ముడుచుకుని
నేను నాశైశవ ప్రపం చంలో ఉన్నప్పుడు
నాలోకి తేజో కిరణరాశుల్ని ప్రసరింపజేసిన
సూర్యవతివి నీవమ్మా'!

అని అని పించింది అమ్మ డా॥ దామెర రాములు గారిచేత

బిడ్డకు ఎంత వయసొచ్చినా, ఎన్ని కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నా అవేవీ గుర్తుకు రానంత మైమరపును అమ్మ పిలిచే 'బాబూ' అన్న ఒక్క పిలుపు కలిగిస్తుంది. అందుకే డా॥ దిలావర్ గారంటున్నారిలా

"ఆమె పిలిచే 'బాబూ!' అన్న పిలుపులో
నా డెబ్బై ఏండ్లూ యింకిపోయి
తూనీగలా మిగిలే బాల్యం"

అమ్మ మనకొక్కరికే అమ్మయితే అందులో నిజంగా అమ్మతనం లేదు. తన జాతికి జీవితాన్ని అంకితం చేసిన భర్తకు భార్యగా ఉంటూనే తన ఆలోచన లకు అమ్మతనాన్ని నిండుగా ప్రసాదించిన తన తల్లిని తలుచు కొని జి.ఎ. రహీం గారు పొందే తృప్తికి అమ్మే సాటి!

**'మా అమ్మ సైదమ్మ!**
**ఏబది లక్షల ముస్లిం**
**నూర్ బాషీయులకు అమ్మ'**

అని అందుకే అనగలిగారు.

తల్లికి బిడ్డా, బిడ్డకు తల్లీ అసమాన మైన వరాలు. లోకం లెక్కలకు అతీ తంగా ఉండే ఆ బంధాన్ని పెంటమ రాజు నరసింగ రావు గారు

'అష్టావక్రుడు
కుబ్జ
ఇనోజినిసెస్
పుడితేనేం,
అమ్మకు
అమృత ఫలాలే
అందాల అరవిందాలే
మందారమకరంద
మాధుర్యాలే,
దొడ్డదైతేనేం
బుడ్డదైతేనేం
గుడ్డి దైతేనేం
బిడ్డకంటికి
అమ్మ ఒక వేలుపు'

అనడంలో అమ్మతనంలోని అవి భాజ్యమైన ప్రేమ రూపం మన ముందు సాక్షాత్కరిస్తుంది.

అమ్మలేని యింట్లో ఉన్నా అమ్మ జ్ఞాపకాలు సజీవంగా ఉన్నచోట జీవ నగమనం ఒడిదుడుకులు లేని సజీవ నదిలా ప్రవహిస్తోంది...

'మంచాన పడ్డ అమ్మకు
చిన్నప్పుడు అమ్మ నాకేం చేసిందో
నేనూ అమ్మకు అన్నీ చేసినా!
అయ్యో! కొడుకా నీ చేతుల్తోని ఇవన్నీ చేసుకొనవడ్తి!
ఇప్పుడు అమ్మ లేని ఇంట్లో
అమ్మ జ్ఞాపకాలతో సంపుటాన్ని నేను!
అమ్మ నాలో జీవనదిగా ప్రవహిస్తోంది!
ఈ జ్ఞాపకాలు రాసుకుంటుంటే ఫోటోల
అమ్మ నవ్వుతున్నది!
అమ్మ ఉన్నట్లే!!'

తల్లికి బిడ్డ సకలోపచారాలు చేసినా యింకా ఏదో మిగిలుంద నిపిస్తుంది. కానీ తన తల్లి జ్ఞాపకాలు తన సేవల్లో సజీవంగా ఉన్నప్పుడు అమ్మతనాన్ని సంపూర్ణ ంగా అర్థం చేసుకున్నానన్న నమ్మకం కందాళై రాఘవాచార్య గారికి కలిగించింది ఆ తల్లే!

ఎవరి ఊహల ప్రకారం ఎవరి తల్లి వాళ్లకు వేరువేరుగా కనిపిం చొచ్చుగానీ అసలైన అమ్మతనం అర్థమయినప్పుడు ఏమనిపిస్తుం దంటే అమ్మకు ఉపమానాలు లేవేవోనని అందుకే డా॥ లక్ష్మణా చార్యులు గారు.

'అమ్మంటే గగనమంతా పరచు కున్న నీరెండ'
అని అంటునే
'అమ్మకి ఉపమానం అమ్మే' నంటారు
కాదనగలమా?

జీవితమంతా పరచుకున్న అమ్మ జ్ఞాపకాలతో

'ప్రపంచమే అమ్మ'
'అమ్మే ప్రపంచం'

అనిపించింది అమ్మ డా॥ విప్లవ్ దత్ శుక్లా గారిచేత

ప్రపంచాన్ని ఒకడుగు ముందుకు తీసుకెళ్లగలిగేది కవిత్వమే. ఆ కవి త్వానికి అవధులు లేవనిపిస్తూ అమ్మ కూ కవిత్వాన్నికి అభేదం చూపిస్తూ ఒకడుగు ముందుకు వేస్తున్న డా॥ బీరం సుందరరావు గారు

'బతుకు పుష్పంపై పుప్పొడి అద్ది
జీవితాన్ని పరిమళభరితం చేసేది అమ్మ
అమ్మ కానిదేదీ కవిత్వం కాదు'

అని నిస్సంకోచంగా చెబుతు న్నారు

తల్లీ బిడ్డా, బిడ్డా తల్లీ యిదో చక్రబంధం. లేకపోతే డా॥ యు. దేవపాలన గారు యిలా అనగలరా?

'నా బిడ్డల్లో కూడా
మా అమ్మను చూస్తూనే ఉన్నా
తల్లి మదిలోకి రాగానే
తొలకరి చినుకుల సందడి...'

అమ్మకూ మట్టికీ అంటే తల్లికి ఆ తల్లికీ అంటే నేల తల్లికీ, అమ్మ లగన్న అమ్మ నేలమ్మ నుంచి పుణికి పుచ్చుకొన్న నిరంతర సహానానికి చిహ్నంగా ఉన్న తల్లిని గురించి

'మట్టి ఎవర్నైనా మోస్తుంది
ఎంతటి పాపాత్ముణ్ణైనా జీర్ణించు కుంటుంది
అమ్మలాగే!!"

నిర్ణయాత్మకంగా చెప్పగలిగారు ఈతకోట సుబ్బారావు గారు

తన గుండెల్లో నిండిన ప్రేమ తన వాళ్లకు మాత్రమే పంచడా నికి కాదు పదిమందికీ పంచ మని ఆ తల్లి తన జీవితం సాక్షిగా చూపించి ఉండక పోతే అంజనాదేవి గారు

'అమ్మా! నీ ప్రేమతో నా ఎద నిండివుంది
పది మందికి పంచుమని నింపి వెళ్లావా!
అమ్మా! అని పిలిచే చిన్న పాపలో సైతం నీవున్నావు
ఆ బోసి నవ్వుల్లో నీ ఆత్మీయత కనిపిస్తుంది' అని అనగలిగి ఉండేవారు కాదు.

ఏ ఫలితాన్ని ఆశించిన అది అందరికీ ఆనందాన్ని కలిగించ గలిగితే అటువంటి నిర్మలమైన మనసుకు ప్రతిరూపంగా నిలిచేది ఏది కనిపిం చినా తన వల్లే గుర్తొస్తుందంటున్న మాధవీ సనారా.

'పసిపిల్లలు పలుకరించినప్పుడ ల్లా
విరిసే పూవులు మురిపించినప్పు డల్లా
మంచి మనషులు తటస్తించిన ప్పుడల్లా
అమ్మ నాకు యాదికొస్తునే వుం టుంది" అంటూ ప్రకృతితో మమే కమైన తల్లిని నిరంతరం చూస్తున్నా రు.

అమ్మ కథ కాలానికి వారధి అనడం కొత్తగా ఉంది. అంటే బిడ్డ జీవిత కాలానికి సరిపోయే వారధిని ముందే కట్టించి యిచ్చిన అమ్మను గురించి సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గారు.

'మమతనంత కలబోసిన నీ కథను
కాలానికి వారధిగా చెబుతు న్నాను
రాజీపడని రాయంచగుణము నీదని,
ప్రేమకు, అనురాగానికి నిజమైన అర్థం నీవని...'

అంటున్నారు.

బిడ్డ జీవితంల బాధాకరంగా గడుస్తున్నదని తెలిసినా ఏమి చేయలేని నిస్సహాయతలోనూ మాట సాయం లాంటి మనసు సాయం చేసి వెళ్లిపో యిన తల్లి బిడ్డ చేత ఎటువంటి సంక ల్పం చేయిస్తుందో చూడండి యస్. నాగమణి గారి కవిత ద్వారా

'నా గుండె గదినిండా ముళ్ల గాయాలే
నీవు బ్రతికుంటే భరించేదానివి కాదమ్మా!
అందుకే నాకు
చదువుల తల్లిని జతచేసి నువ్వెళ్లి పోయావు
అక్షర యజ్ఞానికి సమిధయైన సబలగా
నా జీవితమంతా గుర్తుంటావ మ్మా
నేనిప్పుడు
అక్షరాన్నందించే టీచరమ్మను
నీ సంకల్పానికి సారధిగా నేనుం టానమ్మా!'

తాను బతికున్నంత కాలం ఎదు రీతగా జీవితాన్ని భరించినా జీవితా నికో నికరమైన మార్గాన్ని చూపించి వెళ్లిపోయిన తల్లి కేవలం తల్లికాదు గురువు, దారి దీపం. అందుకే కాసోజు లక్ష్మినారాయణ గారు.

'అయ్య పోయినా
గుండె రాయిచేసుకొని, శ్రమశక్తి తో
కువలయాన్ని ఈదిన మా అమ్మ
నాకు ఈత నేర్పింది'

అంటున్నప్పుడు అమ్మతనంలోని ప్రేమకు మరో మహాగుణం వ్యక్తమౌ తోంది.

తల్లి తల్లిగా బిడ్డను ప్రేమించి తను కష్టపడ్డా తన బిడ్డ కష్ట పడకూడదను కోవడం సగటు తల్లిదనం. కానీ తన బిడ్డ కష్టపడినా అది పది మంది కోసం పోరాడే పటిమను కలిగించాలనే తీర్మానాన్ని బిడ్డ మన సులో కలిగించ గలిగిన తల్లి కేవలం ఒక్కరికే తల్లి కాదు, జాతికి తల్లిగా విస్తరించ గలిగింది. గనకనే కుర్సం లత గారిచేత యిలా అనిపించ గలిగింది.

'ఇల్లు విడిచి నేను వెళ్లి పోయానని
గుండె బాదుకొని బెంగ పెట్టు కోకు...
ఈ కష్టాలు కలకాలం వుండ బోవమ్మ
మన పేదోల్ల రాజ్యము తప్పక వస్తుంది.
చల్లగ దీవించి సాగనంపమ్మ
అమరుల దారిలో పోరాడి నే వస్త...'

అమ్మతనంలోని అక్షయమైన గు ణాన్నీ జీవితాన్నీ మధించిన తాత్వికు నిగా శాస్త్రి గారు ఎంత లోతుగా చెబుతున్నారో చూడండి అమ్మను గురించి!

'అక్షరం అంటే నాకు అమ్మ స్ఫూర్తి స్తుంది
చదువులేదు కాబట్టి
అమ్మకు ప్రేమించటం ఒకటే తెలుసు
అమ్మ నేర్పేది నాలుగేళ్ల చదువూ,
నలభయ్యేళ్ల జీవితమూ!
అక్షరము అంతే
అమ్మ ప్రేమనూ అక్షరం ప్రేమ నూ
తెలుసుకున్నప్పుడే
జీవితం మొదలౌతుంది!'

'అమ్మ నేర్పేది నాలుగేళ్ల చదువూ నలభైయ్యేళ్ల జీవితం'

ఎంత అలవోకగా ఎంత బలమై న మాట చెప్పారు అమ్మను గురించి శాస్త్రిగారు

జీవితమనే పలక మీద ఒక్కొక్క దశలో అమ్మ ఒక్కో అక్షరాన్ని చెక్కిన విధానాన్ని సి.హెచ్.ప్రకాశ్ గారు.

'జీవం నేల మీదికి చేరగానే
నింగిలోన చందమామకు చెల్లెలై యింది అమ్మ
మురిపాల మాటల పూదోట లో
ముద్దు పలుకుల చిలుకమ్మకు నేస్తమయింది
చిట్టి చిట్టి పాదాలతో అడుగులు వేస్తుంటే
తీరైన నడకల నెమలికి ప్రతీక యింది
తెలివి పూల వనంలోకి రా రమ్మంటూ
పసి ప్రాయంలోనే నొసటి పలక మీద
అసలు సిసలు అక్షరమై నిలిచిం ది అమ్మ'

పేదరికం సాక్షిగానే అక్షర సత్యా లను మరోరకంగా చెప్పించింది అ మ్మతనం చలపాక ప్రకాష్ గారిచేత.

'ఆకలైతే...
పంచభక్ష పరమాన్నాలే కాదని
పచ్చడి మెతుకులు..
గంజి నీళ్లూ 'తక్కువ' ఖర్చుతో
ఎక్కువ 'శక్తి' నిస్తాయనే సత్యం చెప్పింది'!

అమ్మా నువ్వు నాకెన్నో ఏవేవో చేశావు తద్వారా నువ్వు నాకు విడదీ యలేని బంధమై నావు. ఎటు వెళ్లినా నీ వైపుకే రాకుండా ఉండలేని ఒక తియ్యని అశక్తతను ఎంత అందంగా నింపావమ్మా నా జీవితంలో

మిగతా 3వ పేజీలో..



డి.సేనాపతి 122 | రంగనాథ్ 114 | డా॥ద్వానాశాస్త్రి 17 | బిక్కి కృష్ణ 86 | జనజ్వాల 8 | తెన్నేటి సుధాదేవి 9 | డా.ఎస్.వి.ఎస్. 10 | డా.చక్రపాణి 12 | వి. రాధాకృష్ణ 13 | కె.రామారావు 14 | జి. శ్యామల 15 | మరికంటి 16 | జి.ఎ. రహీం 5



డా॥ఎన్.శంకరం 11 | మౌనశ్రీ మల్లిక్ 7 | సాహిత్యప్రకాశ్ 100 | ఎస్.ఆర్.పృథ్వి 65 | డా॥డి.రాములు 77 | పి. లక్ష్మణ్ రావు 70 | బొబ్బిలి జోసెఫ్ | బి. కీర్తి 67 | వి. సూర్యారావు 120 | మాధవీ సనారా 74 | డా॥ ఎ.సుజాత 71



శైలజామిత్ర 18 | ఎస్.ఎం.సుభాని 80 | ఎస్.గఫూర్‌శిక్షక్ 75 | పి.నరసింగరావు 19 | ఎన్.రామయ్య 20 | ఏ. రేణుక 21 | వనం రాజేష్ 22 | పి.శ్రీనివాస్ 23 | అనిశెట్టి రజిత 62 | కొండ్రెడ్డి 63 | డా. దేవపాలన 64 | టి.పద్మావతి 102



కంశ్రీ 90 · ఆర్.శ్రీనివాసరెడ్డి 94 · పి. సింహాద్రి 93 · పి.రాజయ్యగౌడ్ 92 · చలపాక ప్రకాశ్ 91 · వై. దేవదానం 104 · నాగభూషణాచార్య89 · సి.హెచ్. ప్రకాశ్ 88 · లక్ష్మీనారాయణ 81 · కె. నిహారిణి 76 · బైస సదానంద్ 3 · వి.వి.ప్రసాదరావు · ఏ.ఏ. ప్రసాద్ 39 · డా. గౌరీశంకర్ 59



జి.విజయలక్ష్మి 85 · దమయంతి 48 · వి. ప్రకాశ్ 47 · పద్మకళ 96 · శాగంటి శ్రీకృష్ణ 49 · ఎ.శ్రీనివాసరాజు 50 · అనురాధ 51 · కుర్సం లత 82 · అంబల్ల జనార్ధన్ 97 · డి.ఎస్.మూర్తి · డా॥ తిరునగరి 83 · అంజనాదేవి 73 · ప్రసాదమూర్తి 87




అంటున్నారు షరీఫ్ గారు

**'నా బలం నువ్వే,**
**నా బలహీనతా నువ్వే'**

రెండు మాటల్లో రెండు ప్రపంచాల్ని చూపిస్తున్నారు షరీఫ్ గారు.

రూపం సారం కలిగలిసిపోయిన అవినాభావ సంబంధాన్ని తల్లీ బిడ్డల బంధంలో చూపిస్తున్నారు పద్మకళ గారు

**'అమ్మా!**
**గుండెనాది చప్పుడు నీది**
**రూపం నాది ప్రాణం నీది**
**గెలుపు నాది ప్రేరణ నీది**
**ఆచరణ నాది ఆలోచన నీది**
**సవాలు నాది భరోస నీది**
**పంచభూతాలను నడిపించే**
**నీ వాత్సల్యం వజ్రాయుధం**
**సహనం నీ అలంకారం నీ ప్రేమ నాకు వరం!'**

అమ్మ జ్ఞాపకాలు, ఆకాశం రంగులు అనంతంగా అలా కలదిరు గుతూ ఉంటాయనే మధురమైన భావనను సాహిత్యప్రకాశ్ గారు వ్యక్తం చేసిన తీరు అమ్మా, ఆకాశాల అభేదాన్ని అందంగా చూపించింది.

**'ఆకాశంలో మెరిసే ఇంద్రధనస్సుని చూసినప్పుడల్లా**
**నువ్వే అక్కడ రంగురంగుల చీరలారేసినట్టు అనిపిస్తూ వుంటుంది.**
**నువ్వు లేకపోయినా నీ చీరలతో, నీ స్వహస్తాలతో**
**నువ్వే కుట్టిన బొంత నీ జ్ఞాపకాలతో గుండెని తడిచేస్తూనే వుంది**
**అది గంతలతో, అతుకులతో వున్నదే కావచ్చు**
**పాతబడి, రంగు వెలిసిపోయి వుండవచ్చు**
**కానీ, అది నా మనసుకు అపురూపం**
**నీ మమతకు ప్రతిరూపం**
**అలసటతో తనువును బొంతపై పరిస్తే**
**నీ ఒడిలో సేదదీరుతున్నంత నిశ్చింత**
**అందుకే, అమ్మ ప్రేమంటే ఆకాశమంత'**

ఆహా! ఎంత ధీరత్వాన్ని జీవితంలో నింపుకుందో గానీ ఆ అమ్మ ప్రకృతి లోని ప్రతి ప్రమాణికాన్ని తనలో చూపించగలిగిన తన తల్లిని గురించి కె.వి. **రమణారెడ్డి గారు.**

**'ఉదయించే సూరీడుని**
**మా అమ్మ నుదుటన దర్శిస్తాను**
**ఆకాశమంత ఆత్మ విశ్వాసం**
**హిమశిఖరం లాంటి వ్యక్తిత్వం**
**పచ్చని చెట్టులా నిస్వార్థ సాయం**
**పిడుగులు పడ్డా చెదరని మనోనిబ్బరం**
**మా అమ్మ ఎల్లమ్మ సొంతం**
**అసలా పేరంటేనే పులకింత!'**

అనడంలోని పులకింతను మనమూ అనుభవించగలం!

ఒడి చిన్నదే అయినా అందులోనే సమస్తాన్నీ చూపించగలగడమే అమ్మతనంలోని మరో మహాగుణం. ఆ గుణ సౌందర్య పరిమళమే మనిషిగా తీర్చిదిద్దబడటం. అందుకే తాటికోల పద్మావతి గారు.

**'తన వడిలో జగమంతా చూం స్తుంది**
**మానవత్వంతో**
**మనిషిగా తీర్చిదిద్దేది అమ్మ!'**

అమ్మతనంలోని మరో మహాగుణం చూడండి

**'తన కష్టాలను అవమానాలను అక్షరాలుగా మార్చి**
**కథలుగా, నవలలుగా మార్చింది అమ్మ!**
**బడిలో చదువుకోకున్నా తాత ఒడిలో పాఠాలు నేర్చుకుని,**
**పద్యాలుగా పాడుకుని**
**తన చేదు అనుభవాలనే**
**రచనలుగా అల్లిన అమ్మ ఒక అజ్ఞాత రచయిత్రి'** అంటున్నారు గరిశకుర్తి రాజేం ద్ర. నిజం కదూ! ప్రతి అమ్మ రాయని ఒక అజ్ఞాత రచయిత్రి! ఎంత మంచి పరిశీలన!

జీవితమే అమ్మ కానుక అయినా అందులో క్రమేణా మనకు గోచరించే విలువైన కాంతులకు ప్రతీకలుగా రావి రంగారావు గారు మినీ కవితలోనే మహాపరిణామాలకు దారి తీయగల మేరువులను అమ్మ యిచ్చి న కానుకలుగా చూడగలిగారిలా.

**'నా హృదయం**
**నా మేధ**
**మా అమ్మ కానుకలు**
**భూదేవి**
**ఆదిశేషుడు**
**మా అమ్మ భుజాలు..**
**కల్పతరువు**
**కామధేనువు**
**మా అమ్మ శిష్యగణాలు..'**

అమ్మతనంలోని మరో మహాగుణాన్ని అతి సాధారణమైన పదాల తో ఎంత బాగా చెప్పారో చూడండి పొత్తూరి సుబ్బారావు గారు

**'తాను తిని నలుగురికి పెట్టాలనే**
**సాంప్రదాయాన్ని ప్రక్కకు పెట్టి**
**అందరికీ పెట్టిన తరువాతే**
**తాను తినాలనే**
**సిద్ధాంతంతో**
**ఇంటిల్లిపాదికే కాక**
**అతిథులెందరికో వడ్డించి**
**'అన్నపూర్ణమ్మ'గా తన పేరును**
**సార్థకం చేసుకున్నప్పుడు**
**అక్షయపాత్రేదో తన వద్ద**
**ఉన్నదేమోననిపించేది'**

నలుగురికి పెట్టాలనుకోవడం లోనే మనసులో అక్షయపాత్ర ఉంది అని అర్థం. నలుగురికి పెట్టే చేతిలో అక్షయపాత్ర ఉందనిపించే అమ్మతనం ఎంత దయాగుణాన్ని తనలో యిముడ్చుకుంటుందో!

ఇక జీవితాన్ని కాచి వడబోసిన కవిగారికి తల్లిలోని మహత్యం ఎలా కనబడుతుందో చూడండి.

**'మనుగడ ఒక ప్రశ్న కాదని**
**ఎదురీతే నిరంతర లక్ష్యంగా**
**శ్రమ వేదికపై నిలిచింది'**

అనిపించేంత తాత్వికతను నేర్పించింది. తల్లి నుంచి తాత్వికతను నేర్చు కొనే అవకాశం అతి కొద్ది మందికి వస్తుందేమో! ఆ కొద్ది మందిలో ఒకరైన నిఖిలేశ్వర్ గారు ఏమంటు న్నారో చూశారు గదా!

ఇక చివరిగా డా॥ ఎన్. గోపి గారేమంటున్నారో చూశారా?

**'అమ్మ కూడా చచ్చిపోతుంది'**

అని

నిజమే అమ్మ కూడా చచ్చిపోతుంది. కానీ అమ్మతనం చచ్చిపోదు అందుకే మానవ జాతి మనగలుగుతోంది. అమ్మ మనకు జన్మనివ్వడమొక్కటే కాదు, మనిషిగా బతకడానికి కావలసిన మనసునిస్తుంది! ఆ మనసు అమ్మతనంతో నిండిపోతూనే ఉంటుంది. అందుకే కవిత్వంలో అమ్మ చిరంజీవిగా ఉంటుంది. అమ్మే కవిత్వం, కవిత్వమే అమ్మ.

అమ్మ మీద కవితా సంకలనాలను ఈ మధ్య కొన్ని చూశాను. అమ్మను ఎన్ని కోణాలనుంచి కవులైన బిడ్డలు చూడగలరో వాటిని చదివితే తెలిసింది. అయితే, తెలుగు భాషకు ఎందరో కొత్త కవులను సంపాదించి పెట్టే బాధ్యతను తనకు తానుగా తీసుకున్న 'నేటినిజం' పత్రిక యిప్పుడు 'అమ్మ' మీద వో కవితా సంకలనాన్ని తేవడం ఓ విభిన్న ప్రయత్నం.

**'నేటి నిజం'** పత్రిక ప్రయత్నానికో ప్రత్యేకత ఉంది. చాలా మంది కొత్త వాళ్ల చేత అమ్మ మీద కవితలు రాయించి వాటిని ప్రచురించడం. కొత్త కవులు అమ్మ మీద రాసిన కవితల్లోనే మంచి భావనాసౌందర్యం కనిపించింది. అయితే యిక్కడే ఓ మాట చెప్పుకోక తప్పదు. మాములు వచనాన్ని వాక్యం కింద వాక్యం రాసిన వాళ్లు ఎక్కువ మంది కనిపిస్తున్నారు. కవిత్వం చదివాక భావంతో బాటు నాలుగు మాటలు ఒక వరసలో గుర్తుకు రావాలి కదా! దాని కోసం కొంత సాధన చెయ్యాలి.

**'అమ్మ'** కవితా సంకలనాన్ని సంపాదకులు **శ్రీ బైస దేవదాసు** గారు నా చేతికిచ్చి నా అభిప్రా యం రాయమని అడిగినప్పుడు సంతోషంగా ఒప్పుకున్నాను. చిరకాల మిత్రులు, సాహితీ ప్రియులు, కొత్తకవులను నిరభ్యంతరంగా ప్రోత్సహించే శ్రీ దేవదాసు గారు ఈ అవకాశం నాకిచ్చినందుకు సంతోషంతో నా అభిప్రాయం రాయడానికి వొప్పుకున్నాను.

సంకలనం చదవడం మొద లు పెట్టగానే చాలా తొందరగా అయిపోయింది. కారణం చాలా చోట్ల ఆగి ఆహా అనిపించే కవిత్వం లేకపోవడం. అయితే శ్రీ దేవదాసు గారి స్ఫూర్తితో మళ్ళీ యింకోసారి చదివితే నా భావం మారొచ్చేమోనని మళ్లీ చదివాను. రెండోసారి చదువుతున్నప్పుడు కొన్నిచోట్ల భావాలు నచ్చాయి. మళ్లీ యింకోసారి చదవడం మొదలు పెట్టగానే కొన్ని కవితా పంక్తులు గుర్తుండిపోయేలా అనిపించాయి. ఆ భావం కలగగానే ఎంపిక చేసినవే యిక్కడ నేను ఈ పరిచయ వాక్యాల్లో ఉదాహరించుకోవడానికి ఎన్ను కున్నవి. అలా అని చెప్పి ఉదాహ రించదగినవి యింకా లేవని నేనన ను. మీరూ చదవండి. నా దృష్టిని నిలవలేకపోయినవి కొన్ని మీ దృష్టిని నిలపవచ్చేమో. అలా మరి కొన్ని కవితలను మీరీ సంకలనంలో గుర్తుపట్టగలుగుతారని నాకనిపిస్తోంది. అటువంటి ఆశా, నమ్మకం లేకపోతే శ్రీ దేవదాసుగారు కొత్త కవులను నిరంతరం పరిచయం చేసే బాధ్యతను తీసుకొని ఉండేవారు కాదేమో! అందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ముందు ముందు మరిన్ని మంచి కవితా సంకలనాలు వారి సంపాదకత్వంలో వస్తాయని నమ్ముతున్నాను. రావాలని కోరుకొంటున్నాను.

ఈ కవితా సంకలనానికి యింకో ప్రత్యేకత ఉంది. ప్రతి కవి అమ్మ ఛాయాచిత్రాన్ని కవితతో బాటుగా ముద్రించడం. కవుల ఛాయాచిత్రాలను చూసే అవకాశం ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. కానీ ఆ కవిని, కన్న తల్లిని చూసే అవకాశం మనకు రాకపోవచ్చు. అప్పుడు కలిగే నిరాశను నివారించడానికన్నట్టు దేవదాసుగారు అదనంగా శ్రమ తీసుకుని అమ్మల ముఖచిత్రాలను మనకందిస్తున్నారు. ఆయన ఏది చేసినా ఒక కొత్తదనమే! దాని వల్ల ఓ అదనపు విలువ.

కవిత్వం భాషకు, భావానికి అదనపు విలువ. అదెక్కడుందో వెదికి పట్టుకోవడానికి కొత్తవారిని ప్రోత్సహించి వారిని మనకు పరిచయం చేయడం ఓ అదనపు విలువ. ఆ కవులను తయారు చేసిన అమ్మతనం ముఖచిత్రాలను మనకు అందించడం మరో అదనపు విలువ. ఇన్ని అదనపు ప్రయోగాలను మనకు కల్పిస్తున్న దేవదాస్‌గారి కృషికి నమస్సులు. ఈ కవితా సంకలనం యింకొన్ని సంకలనాలకు యిం కొన్ని కొత్త ప్రయత్నాలకు, కొత్త ప్ర యోగాలకు స్ఫూర్తి కాగలుగు తుందని నా నమ్మకం. ఇక అమ్మ అనే జీవనదిలోకి మీరూ దిగండి. నేరుగా ఈతకొడతారో, పడవ సాయంతో దాటడానికి ప్రయత్నిస్తారో, వొడ్డున కూర్చుని, ఆ నది ఒడిదుడుకులను గమనిస్తారో అదంతా అమ్మ మీకిచ్చిన వారస త్వం. అందుకు మీరు గర్వించడంలో ఏ మాత్రం తప్పులేదు. తప్పుడు వాళ్లు కూడా అమ్మలు కావచ్చు గానీ అమ్మకావడంలో తప్పులేదు.



వెంకటదాసు 24 · కందాళై 25 · ఆర్. ఎల్లయ్య 37 · డా.పి.జయప్రద 26 · సి.శ్రీరామూర్తి · ఇ. సుబ్బారావు



వి.పి.చందన్ 105 · డా.కె.లింగారెడ్డి106 · జివిఆర్‌కెఎస్ 107 · కె.లక్ష్మీకాంతం 108 · ప్రొ.ఎం.చెన్నప్ప 109 · డా. దిలావర్ 110 · కె.నాగిరెడ్డి · కె.తిరుపతి 133 · వివిఎస్‌ప్రసాద్ 134 · కె.పుష్పాదేవి 31 · టి.చక్రవర్తి 103 · పడిచర్ల సత్యం 98



కె.రాణీప్రసాద్ 121 · కె. చంద్రశేఖర్ 124 · పి.లలిత 125 · రావిరంగారావు 126 · వై. సుదర్శన్ 127 · యస్.ఎన్.శర్మ 128 · సబ్బని 129 · డా.కొండయ్య 130 · ఎం.గోపాల్ 57 · దోర్నాదుల 131 · పి.సుబ్బారావు 132 · శ్రీమాన్‌శ్రీకాశ్యప 112 · డా.జంగయ్య 123



నారాయణరావు 40 · జనార్ధనాచారి 41 · విష్ణుదత్‌శుక్లా 42 · శ్రీ కాళహస్తి 43 · జి.రాజేంద్ర 118 · బాలవర్ధిరాజు 117 · ఎన్‌జె.ఎమ్.ఆర్116 · పోతుకూచి 115 · ఎస్.విజయలక్ష్మి 72 · డా॥ శమశ్రీ 69 · ఎల్.వి.ఎస్. 113

చంద్రశేఖరరెడ్డి 32 · అద్దేపల్లి జ్యోతి 33 · జి. రమణయ్య 34 · వాసాల శౌరి 35 · వి.సుబ్బయ్య 36 · లక్ష్మణాచార్యులు 29 · ఎస్.ఎ.షరీఫ్ 95 · ఆచార్య నరేంద్ర 30 · బి.ప్రసాదరావు44 · డి. సోమేశ్వరరావు 45 · ప్రొ. రవిప్రసాద్ 46



పి. అమరజ్యోతి 52 · కెవి.రమణారెడ్డి101 · డా. బి. సుందరరావు53 · కె.సి. లలిత 54 · బి. హనుమారెడ్డి 58 · యస్. నాగమణి 78 · డివిఆర్‌కె.శాస్త్రి 84 · సామ లక్ష్మారెడ్డి 61 · ఎస్‌విఆర్‌ప్రతాప్ 56 · సిరాజొద్దీన్ 60 · ఎం.రాఘవాచారి 79 · సంబరాజు 119 · ఎమ్.శ్రీధరరావు 38 · డా॥ శిల్ప 136

# అంజనీకుమారికి 'కళారత్న పురస్కారం' ప్రదానం



పుస్తకావిష్కరణలో అతిథులు.

సిటీసివిల్ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్, ప్రముఖ సంఘ సేవకులు పీవీపీ అంజనీకుమారికి 'కళారత్న ధార్మిక సేవా రత్న పురస్కారం' బహూకరించారు. తెలంగాణ జాగృతి సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారాన్ని నిర్వాహకులు పద్మా వెంకటేశ్, ప్రముఖ కవి డా॥ ఎన్.కే.రాము బహూకరించారు. ఈ సందర్భంగా అనేక సంవత్సరాలుగా అంజనీకుమారి సేవా కార్యక్రమాలను అతిథులు అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఘర్షణ శ్రీనివాస్, దరువు అంజన్న, కృష్ణకుమారి, వెల్లమంచి ధనలక్ష్మి, సూర్యమీనాక్షి, ప్రతిపాక రేవతి, చింతలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు

## జీవితచక్రం

వసంతం వస్తుంది పోతుంది
కింకిరం కూస్తుంది కనుమరగవుతుంది
కాలం తిరుగుతుంది పరుగెత్తుతుంది
ప్రాయం పెరుగుతుంది పైనబడుతుంది.
బాల్యం ఆడిస్తుంది పాడిస్తుంది
యవ్వనం విజ్ఞానాన్నిస్తుంది
వన్నెలుచిందిస్తుంది
కౌమారం కవ్విస్తుంది కోర్కెలులేపుతుంది
వృధ్యాప్యం వెంటబడుతుంది వేధిస్తుంది.
జననం సంభవిస్తుంది సంతసపరుస్తుంది
మరణం కబళిస్తుంది మట్టిలోకలుపుతుంది
స్నేహం కుదుటపరుస్తుంది
కుతూహలపరుస్తుంది
ద్వేషం బాధిస్తుంది భయపెడుతుంది.
పెళ్ళాం జతకొస్తుంది అండనిస్తుంది
సంతానం
ఇంటకలుగుతుంది ఇంపునిస్తుంది
ప్రాణం
కొట్టుకుంటుంది గాలిలోకలుస్తుంది
కాయం కుళ్ళుతుంది కాలుతుంది.
సమాజం
అవకాశాలిస్తుంది ఆదరిస్తుంది
జీవితం పండుతుంది రాలుతుంది
లోకం అజరామరం అనంతం
జీవితం క్షణభంగురం కాలబద్ధం.
దీపం ఉండగానే ఇల్లుచక్కబెట్టుకో
ప్రాణం ఉండగానే బాధ్యతలుతీర్చుకో
శాశ్వతం ఏదీకాదని తెలిసినడచుకో
సొంతం ఏవీకావని ఎరిగిమసలుకో.

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630



## కోకిల

### ముందే కూసింది

తొందరపడి
ఓ కోయిల
ముందే కూసింది!
విద్యార్థుల
భవిష్యత్తు
ప్రశ్నార్థకమైంది!!

### గూడు కట్టుకుంది

తనకు
గూడు కట్టుకోవడం
రాకపోతేనేం.?
ఎందరో
హృదయాలలో
గూడు కట్టుకుందిగా!
కోకిలయ్య
ఎందుకో 'కోకిలయ్య'
వెనుకబడ్డాడు!
కుహూ కుహూ
అంటూ రాగా లాలపించేది
మగ కోకిలైతే...
ప్రశంసలు దక్కుతున్నది
'కోకిలమ్మ'కి!!

### కోకిల కంఠం

కమ్మని
పాటల క్యాసెట్
కాదది ...!
కోకిల
గానం!!

### కోయిల కూత

అడవుల్లో
తుపాకీ మోతలు
ఆగితేనే కదా ...
కొమ్మల్లో
కోయిల కూతలు
వినబడేది!

-ధనుంజయ రెడ్డి

## మళ్ళీ మళ్ళీ రా రాగాల రాణీ

ఓ కోకిల!
నీవు వస్తేనే ప్రపంచం కిలకిల!
నీలి రంగు నలుపైతేనేం
నీ పాట తెలుపే కదా!
మాకందరికీ వెలుగే కదా!.
నీవొస్తేనే ఆమనికి నిండుదనం
గుణానికి విలువ వచ్చే జనం
నీ నలుపును పట్టించుకోరు!
నలుపు నారాయణుడు మెచ్చు
ఇక నీకు మాకు ఏల చింత!
ఎంత మంచి దానివి కోకిలా!
నీవు వస్తూ వస్తూ
మామిడికాయ తెచ్చావు
తీపి బెల్లం వేప పువ్వు తెచ్చావు,
అందుకే ప్రతి ఉగాది సంపన్నమౌతూ
ఆరోగ్య వరాన్నిస్తూ ఉంది...
మళ్ళీ మళ్ళీ రా కోకిలా
మా లోని నలుపూ తెలుపూ
బేధాలు సమసిపోయేలా
విశ్వ మానవులుగా కలిసి పోయేలా!

- అనంతవురం
బదరీనారాయణ,



అంశం : కోయిల

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. 2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 13 కు మొత్తం 26 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 13 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి. అందులో మొదటి భాగం కవితలు ఇవి.

## వచన కవితలు

కోకిలా కాకిలా..
రాకిలా రాకిలా...
ఏకాకులు నీ గానం
వినేటట్లు లేవు
చిగురాకులు నీ కోసం
చింతించుట లేదు
ఈ జనాలు ధనములో
మునిగి తేలుతున్నారు
ఈ వనాలు ఇంధనముగ
దహనం చేస్తున్నారు?!
పాట కోసం పరితపించక
వేలం పాటలకి వెడుతున్నారు..
రస పట్టు తెలియక మనుషులు
పాములా బుసకొట్టిపోతున్నారు..
వసంతాన్ని ఆహ్వానించకుండా
వశువుల సంతలో
నిలబడుతున్నారు,
మనసు పరవశించాల్సిన చోట
సొగసులు పర వశ మౌతున్నాయి?!
గుబురు కొమ్మల మధ్య ఏవి కోకిలలు
జిగురు రెమ్మల మధ్య ఇరుగో జనాలు
శ్రవణానందంగా ఉంటుంది కోకిల కంఠం
రావణకాష్టంలా మండుతోంది ఈ యిల యుద్ధం.
శాంతి లేదు, సౌకుమార్యం లేదు,
పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ఎప్పుడో వేశారు,
నీ నోరు నొక్కే ఎత్తు ఏదో చేస్తున్నట్లు
ఉన్నారు మానవాధమ వీరకిశోరాలు!?
కమనీయ కవితల్లోనే చూసుకోవాలా కోకిలల్ని!
రమణీయ చిత్రాల్లోనే దర్శించాలా ఇక కోకిలల్ని?!
వద్దు వద్దు అలా చేయొద్దు
ఇప్పటికే ప్రకృతే మనిషిపై పగ బట్టింది.
ఇంకా అన్యాయం చేయొద్దు భూమాతని.
ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రకృతిని కాపాడుకుందాం.
స్వాగత వచనంగా కోకిలచే పాటలు పాడిద్దాం?!

-శ్రీపాద సుబ్రహ్మణ్యం

## మత్త కోకిల పద్యపంచరత్నములు

మెల్ల మెల్లగ తూర్పు కొండల మేను
దాకుచు లోక మం దెల్ల జీవులకున్
ప్రకాశము లీయ భానుడు సాగగన్ తెల్ల వారక ముందె
మేల్కొని తీయ నైన స్వరమ్ముతో
పిల్ల గాలులలోన పాటలు వినిపింతువు కోకిలా.
నీదు గుడ్లను సాక జాలక నేరమే యని తెల్పినన్
వేదనల్ బడమంచు కాకుల పెంపకమ్మును కోరుచున్
మోదముల్ మన మందు జేర్చుచు మోసపూరిత కార్యముల్
యాది నుంచియు నీవు జేయుట న్యాయ మా యిట కోకిలా!.
మావి లేత చిగుర్లు మెక్కగ మంచి పాటలు వచ్చెనా
మోవి దోయిని పత్ని ముద్దిడి మూయ గీతిక లొచ్చెనా
నీవు దగ్గర లేక రమ్మని నిన్ను బిల్చుచు వేడెనా
యేవి నీ గళమందు జేరెనొ యెంచి చెప్పుము కోకిలా!.
చక్క నైన గళంబు తోడను సంతసంబు నొసంగినన్
దక్క లేదుగ కీర్తి పాటకు, దానవారుల కూర్మితో
చిక్కెగా శని యండదండలు చిత్ర భంగిని కాకికిన్
నిక్కమే గద ప్రజ్ఞ నెప్పుడు నెట్టుచుందురు మట్టిలో!.
గూట్లలో తిరుగాడు పిల్లలు కూత లెట్టగ కాకముల్
గాట్లు బెట్టుచు నెట్టుచుండు నికార్సు సంతును బ్రోచగన్
చెట్లు కూల్చుచు వాస భంగము జేయుచుండగ మానవుల్
యెట్లు కొమ్మల మధ్య దాగుచు హృష్టి గానము జేతువే!

-పూసపాటి కృష్ణ సూర్య కుమార్
గుంటూరు

## కోకిల..

కుహూ కుహూఅని కూసే
కోకిలా?! ఓ కోకిలా?!!
పంచమ స్వరంలో
నీవు పాడుతూ ఉంటే
నీతో మేం శృతి కలుపకుండా
ఉండలేం కదా ?!!.
నీ పాట వింటూ ఉంటే
ఏవో పూర్వజన్మ స్మృతులు
గుర్తుకు వచ్చినట్లు తోచి
చెప్పలేని చెప్పరాని
చెబితే అర్థంకాని
అనుభూతులేవో
అందీ అందనట్లు
తోచుతాయి కదా?!!.
నా చిన్నప్పుడు
నీ పాట వింటూ
ఆ మాధుర్యంలో
తేలి ఆడుతూ
మా నాన్నను నిన్ను
చూపించమన్న?.!
చూపించాడు నిన్ను మా నాన్న?
వెంటనే నేనన్నాను నిన్ను
"కాకి పిల్లా" అని...
నిక్కంగా ఈ లోకంలో ఏవీ
శాశ్వతాలు కావు కావు
అని తెలిపే కాకమే
నిన్ను పొదిగిన తల్లి అట కదా!!
నల్లని నీవు
పసుపు పచ్చని ముక్కుతో
నీవు పాడే మధురమైన ఆ పాట
నీ ప్రేయసి కొరకే అని మా అందరకు తెలుసు
బూడిద తెలుపు వర్ణాల
సమ్మిళితమైన నీ ప్రేయసి
నీ పాట విని నీ చెంతకు చేరింది కదా!
అందరినీ అలరించే అందమైన
ద్విరూప జీవులు మీరు,, కదా !!
వసంత ఋతువులో
మావి చిగుళ్ళను భుజించి
మధురాతి మధురంగా పాడి
శృంగార కోరికలను కలుగ జేసి
నీవు
నీ ప్రేయసి కలవడమే కాదు
మా'నవ ప్రేమికులను కూడా
ఏకం చేస్తావు కదా! ఓ సౌందర్య పిపాసి!!

-తోట వెంకటేశ్వర రావు
హైదరాబాదు

మా ఇంటికి దగ్గరలో
మామిడి చెట్ల తోటలోంచి
ప్రతి రోజు ఉదయాన్నే
ఉదయిస్తుం దొక రాగం,
చాలారోజులుగా అదే
నా కొత్తరోజుకు శ్రీకారం,
ఆ రాగంలో ఏదో పిలుపు.
ఆ పిలుపులో ఏదో దగ్గరతనం
ఆ దగ్గరతనంలో ఏదో అర్థం,
మా ఇద్దరికీ
ఎన్నో యుగాలుగా బంధమున్నట్లు....
మా ఇద్దరికీ
ఎన్నో తరాలుగా ప్రేమ ఉన్నట్లు....
మా ఇద్దరికీ
ప్రకృతిలో ఎన్నో పనులున్నట్లు....
వాటన్నిటినీ ఆస్వాదిద్దామని...
తీయగా నన్ను పిలుస్తున్నట్లు,
పొద్దున్నే లేపుతూ...
అమ్మలా ముద్దిస్తున్నట్లు,
ఆ కోకిల పలకరిస్తూనే ఉంటుంది,
సరే ఒకసారి
కలుద్దామని తోటకు వెళితే....
తుర్రుమని ఎగిరిపోతుంది...
మనిషికి దూరమవుతున్న ప్రకృతిలా,
దానికొక గూడు కడదామని...
ఆ స్వరాని కొక
శాలువా కప్పుదామని...
అనుకున్నా....
ఒప్పుకోవటం లేదు,
నేను వెళితే....
తనున్న తోట మాయమైపోతుందని
భయమెమో పాపం,
అవును కదా...
ఇప్పుడు పచ్చధనం పచ్చనోట్లతో
నరికేయబడుతుంది,
అందుకే...
నేనిక్కడ నుండే తన స్వరానికి భాషని
కనిపెడదామనుకుంటున్నా...
ఆ భాషతో తనకొక లేఖ రాసి
క్షమించమని కోరే బాధ్యతని పూర్తి
చేద్దామని.

-శ్రీఅరుణం శ్రీనివాస్

## కోకిల..

పక్షులన్నీ
తమ రూప లావణ్యాలతో
లోకాన్ని మురిపిస్తూ
మెప్పు కోసం
ఆర్భాటం చూపిస్తుంటే..
రంగు, రూపం కాకుండా
ప్రతిభ తో నే
పేరు రావాలని
ప్రయత్నించి
సఫల మైంది కోకిల..
ప్రతిభకే పెద్ద పీట..
ఎక్కడైనా
ఏ రంగమైనా మరి..
రంగు రంగుల
ముక్కులు, రెక్కలు
ఉన్న ఎన్నో పక్షులను
పంజరంలో చూసిన
పిదప
తమ కంటికి అందంగా
కనిపిస్తే బంధించి
స్వేచ్ఛను హరించే
ఈ మనుషుల మధ్య
పసిడికి తావిలాగా
తీయని కంఠం
గాన మాధుర్యానికి
తోడు అంద మైన
రూపం కూడా ఉంటే..
అన్న ఆలోచనకి
భయం కలుగగా..
తనను ఇలా
పుట్టించిన దేవునికి
కృతజ్ఞత చెప్పుకుంది
కోకిల..
అందం అనేది
ఎప్పటి కైనా
శత్రువే నని
ఊరకే అన్నారా మరి..
తన పిల్లల కోసం
తోటి పక్షి కాకిని
మోసం చేసి
దాని గూట్లో కెళ్ళి
"గుడ్లు పెడుతుంది"
తనకు గూడు కట్టు
కోవడం రాదు..
అనే అపవాదొకటి
తన మీదున్నా
స్వర మాధుర్యంతో,
విలక్షణ "కోకిల గీతం"తో
సంపాదించుకున్న
మంచి పేరు ముందు
తన లోని ఆ ఒక్క తప్పు
లోకంలో అంత ప్రచారంలో లేదు
అని
సంతోషపడింది కోకిల..
ఈ లోకం అంతే
ఒక సారి నీకు పేరొచ్చేస్తే ,
తలపై పెట్టుకుంటుంది..
ఏమన్నా తప్పులున్నా
ఆట్టే పట్టించుకోదు మరి..

-శ్రీనివాస శాస్త్రి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1459వ రోజు 'ఆన్ లైన్ షాపింగ్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ఆన్ లైన్ షాపింగ్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## కొట్టుకెళ్ళకున్న కొనవచ్చు సరుకులు

ఆ.వె. బద్ధకస్తులయ్యి బహుదూరముందని
కొట్టుకెళ్లకుండ పట్టుబట్టి
చేతబట్టి ఫోను చేసిరి ఆర్డర్లు
సరుకు వచ్చిచేరె సంబరంబు!.
ఆ.వె. సులభ పద్ధతొకటి సూక్ష్మ రూపంబున
తారుమారు చేయు ధనమునంత
కోడు వర్దు తోడ కొనవచ్చు దేన్నైన
ఫోనుయున్న చాలు పోవు డబ్బు!.

-జక్కని గంగాధర్

## గజిబిజి

గజిబిజి
బిజీ బిజీ జీవితంలో
సమాయనికి ప్రాధాన్యం
క్యూలో నిలబడే ఓపిక తగ్గుదల
ఆన్లైన్ వెబ్సైట్స్ కుమ్మరిస్తాయి ఆఫర్లు.
మైఖేల్ ఆల్డ్రిచ్
ఆన్లైన్ కి ఆద్యుడై చేశాడు సులభం.
కొలుగోలు కన్నా ముందే
సెలక్ట్ చేసుకో బడ్జెట్ అంచనాలు
కొనుగోలు సమయంలో ధరలు చూసుకో
డిస్కౌంట్ పేరుతో కుచ్చుటోపీలు.
ఆన్లైన్ షాపింగ్ ఓ వ్యసనం
అనవసర వస్తువులు కొనే అంటురోగం
ఆన్లైన్ ప్రాడక్ట్ ఒకటి
డెలివరీలో నకిలీ తో బోల్తా.
కంపెనీలు డెలివరీ చేయక మోసాలు
వస్తువు రివ్యూ రేటింగ్
చూడకుంటే ఇంతేసంగతులు
ఎలక్ట్రానిక్ వస్తువులకు
చూడాలి వారంటీ
తెలీక గొప్పకి
ఆన్లైన్ షాపింగ్ చేస్తే
నెత్తిన చేతులు
తిరుక్షవరం
ఎవరూ చూపరు కనికరం.

-ఎ.రాజ్యశ్రీ

## తస్మాత్ జాగ్రత్త

ఆన్లైన్ షాపింగ్
ఫోన్ దురద.
షాపుకుపోయి కొనుక్కుంటే
డబ్బును బట్టి వ్యాపారం
ఇదో కొత్త మోజు.
ఏది మనం తెప్పించాలన్నా
అమ్మేవారి అనుపానులు
నిజాయితీ
వారి నమ్మకం
లాభం మనకి మిగులు
లెక్కలు సరిపోల్చి చూచి
ఎక్కువ
లాభముంటే
నమ్మకస్తులైతే కొనవచ్చు.
కొన్ని కొత్త మోజులు
సరికొత్త దురదలతో
గుండు చేసే రకాలకు
జాగ్రత్త తప్పదు
లేకపోతే
తిరుపతికి వెళ్తే
మొక్కైనా తీరుతుంది.
ఇక్కడ అడక్కుండానే
మిగులుతుంది గుండు
తెలుసుకో
నేర్చుకో
సుతి మెత్తగా నడుచుకుంటూ
జీవితాన్ని నడుపుకో!!!.

-కె.కె.తాయారు

## అధునాతన కొనుగోలు

కిరాణా షాపులు మాయం
సైకిల్ షాపులు మాయం
మాళ్లు,
ఆన్లైన్ షాపింగులు
నెట్ ద్వారా షాపింగ్
స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు
ఇల్లు కదలక్కరలేదు
కావలసిన వస్తువు ఎంచుకో
చెల్లింపులు ఆన్లైన్లో
ఇంటికి చేరుతుంది వస్తువు
మోసం కూడా దాగి ఉంది
కోరుకున్న వస్తువు రాకపోవచ్చు
సరి అయిన కొలతలు కాకపోవొచ్చు
నచ్చిన రంగు రాకపోవచ్చు
బ్యాంకు వివరాలు తెలుసు కుని
సైబర్ నేరస్తుల బారిన పడే
అవకాశం.
సమయం ఆదా అయినా
నాలుగు దుకాణాలు తిరిగి
కొన్న థ్రిల్ వేరు కదా
అప్రమత్తంగా చేసుకుంటే
శ్రమ లేకుండా షాపింగ్
సంతృప్తి
సంతోషం.

-మోటూరి శాంతకుమారి



## కాలు కదలదు కాసు వదులుతుంది

ప్రతిదానికి
బొమ్మా బొరుసూ
మంచీ చెడూ తప్పవు మరి.
తినగతినగ వేము తీయనగును
పోను పోను చెడైనా అవుతోంది
మంచే.
మనిషి సుఖ జీవి
సర్వం ఇంటి ముంగిట
ఇక బజారుపర్వం భజగోవిందం.
బిల్లు తగ్గింపులు నిల్
కార్డు చెల్లింపులు ఫుల్
రికార్డు స్థాయిలో వస్తువుల
గృహప్రవేశాలు
దిల్ ఖుషీ
కంప్యూటర్ పెట్టెతో
కథకళి
పగలు రాత్రి
ఉద్యోగ పర్వంతో రాచకార్యాలే.
అందుకే ఆన్ లైన్ అనుగ్రహం
అబ్బో!
అదే ఆధునిక కాల అమృత భాండం.
పెద్ద షాపులు మరీ పెద్దవై
చిన్న అంగళ్లు
ముఖం చిన్నబుచ్చుకుంటున్నాయి
మనుషులకున్న న్యాయం
వ్యాపారంలో కూడా దూరింది.
మనుషుల మధ్య
వ్యాపారాల మధ్య
దూరం భారంగా మూలుగులు
అభివృద్ధా? ఇది అధోగతా?
ప్రశ్న ఎప్పుడూ సశేషం.

-డా.సి.వసుంధర

## ఓ మార్గం

నేటి సమాజంలో
మన జనం ఆధునికం
ఆన్లైన్ షాపింగులు నవీనం
నింపాయి ప్రజల్లో బద్ధకం
వసూళ్లు సులభం
అవసరాలు అలౌకికం
దొరికాయి వస్తువులు విరివిగా
లభించాయి
నిత్యావసరాలు తేలికగా
అప్పు కోసం మారింది
తాకట్టు లేని దారిగా
బిల్లులు కట్టవచ్చు
సమయానుకూలంగా
నేటి యుగంలో
ఈ భాగోతం తప్పదుగా
రోజురోజుకి కొనుగోళ్ల పెరుగుదల
ఖరీదు చేసిన వస్తువులు భారం
పొరపాటున చేసిన చెల్లింపు
వెనక్కి తీసుకోలేం
దానివల్ల మోసాలు విచ్చలవిడిగా
దొరకరు మోసగాళ్ళు సాధారణంగా
డిజిటల్ యుగంలో
మారింది ఇది ఓ మార్గంగా!.

-డా.రమ్య స్వరూప్

## కాదంటే ఆఫ్ లైనే..!

ఇదేంటండీ..!
ఇంత గరుగ్గా ఉంది..?
వేరే రకాలేవీ లేవా!?
దీనిధరెంతండీ
అబ్బో..అంతుందా?
కొంత తగ్గించి చెప్పండీ!.
డబ్బులు సరిపోవట్లేదు
వచ్చే మాసం కట్టేస్తానండీ
తెలిసినవారి దగ్గరే కొనడం
లేదంటే నాలుగు దుకాణాల్లో చూడడం
నెలవారి ఖర్చెంతో తెలిసేది
దుబారా అర్థమయ్యేది
ఇవన్నీ గతంలోని వ్యాపారం
ఇప్పుడు ఇవేవీ కనిపించని యవ్వారం.
ఫోన్ లోనే నచ్చడం
ఆర్డరు తో రావడం
చేత్తో ముట్టేది లేదు
అడిగినంత కట్టక తప్పట్లేదు
డబ్బుండాల్సిన పనీ లేదు
నగదు చెల్లించే అవసరమూ లేదు
క్రెడిట్ కార్డు చాలు
ఫోను చేతిలో ఉంటే ఎంతకైనా చెల్లు.
కూచున్న చోటునుండి
కదిలే పని లేదు
వంట చేసే అవసరమే లేదు.
కనిపించే వన్నీ నునుపైనవే
కొనిపించి కొంప ముంచేవే
నాణ్యమైనవేనా!?
న్యాయమైన ధరేనా!!?
అత్యవసరమైనవేనా!
ఆడంబరాలకై పరుగులేనా!!.
అగ్గిపెట్టె
సబ్బుబిళ్లా
ఏదైనా ఆన్ లైనే
కాదూకూడదంటే
ఇంట్లో ఉన్న ఇద్దరూ ఆఫ్ లైన్లోనే.

-గుర్రాల వేంకటేశ్వర్లు

## బయలుదేరిన చోటుకే

ఒకడు ఒక పని చేస్తాడు
మరొకడు మరో పని చేస్తాడు
వస్తువులు పుడతాయి
ఒక్కొక్కరు ఒక్కొక్క పని
ఒక్కో పనికి ఒక్కొక్క వస్తువు
పెట్టుబడితో వస్తు ఉత్పత్తి
పెట్టుబడి లేకపోతే సేవలు
సేవలకు ప్రతిఫలం వస్తువులే.
జీవించడానికి అవసరం అన్ని
వస్తువులూ
వీడి దగ్గరున్న వస్తువులను వాడికి
వాడి దగ్గరున్న వస్తువులను వీడికి
వస్తు మార్పిడి విధానంలో ధనం
లేదు.
ధనాన్ని పుట్టించాడు మానవుడు
వస్తువుకు విలువను కట్టాడు
వస్తువుకి వస్తువు రోజులూ మాయం
సేవలకు వస్తువు రోజులూ గతం
ఏదైనా ధనానికే.
వర్తకులు పుట్టుకొచ్చారు
చిన్నపాటి అవసరాలకు
కిరాణా కొట్లు పుట్టాయి
చిన్న అవసరాలకన్నీ దొరికేవి
అవసరాలు పెరిగిపోయి
ఉత్పత్తులూ పెరిగిపోయాయి
కిరాణా కొట్లు పోయాయి
పెద్ద పెద్ద షాపులు వచ్చాయి
సూపర్ మార్కెట్లు వచ్చాయి
అప్పుడు కంప్యూటర్లు లేవు
ఇంటర్నెట్ లేదు.
కంప్యూటర్లొచ్చి ఇంటర్నెట్ వచ్చింది
ప్రపంచంలో ఏ మూల ఏముందో
ఇంట్లో కూర్చుని చూసే రోజులొచ్చాయి
చూసిన దాన్ని
కొనేసే అవకాశాలు వచ్చాయి
కావలసిందల్లా బ్యాంకులో డబ్బు
ఆర్డర్ ఇవ్వడానికి ఇంటర్నెట్
షాపుల్లో కన్నా చవకే
డబ్బు ఆదా
కొనటానికి సమయం తక్కువే
సమయం ఆదా
ఆన్లైన్ షాపింగ్ పుంజుకొంది.
ఆన్లైన్ షాపింగ్ ఎన్నాళ్ళు ఉంటుందో!
మరొక కొత్త విధానం పుట్టే వరకూ
ప్రజలకు నచ్చేవరకూ .
భూమి గుండ్రంగా ఉంది
ఎక్కడ బయలుదేరినా
తిరిగి బయలుదేరిన చోటుకే.

-విత్తనాల విజయకుమార్

## అన్నీ ముంగిట్లోనే

సాంకేతిక సదుపాయం
అన్ని వ్యహారాలు ఉన్నచోటనే
కడుపులో చల్ల కదలకుండా
కాళ్లకు పని చెప్పకుండా
కళ్ళకు నచ్చింది
మనసు మెచ్చింది
వ్యాపారం మొత్తం
అంతర్జాల విపణిలోనే!!.
దుకాణాలు తిరక్కుండానే
చెప్పులు అరక్కుండానే
ఇంట్లో ఉండి అన్ని చక్కబెట్టడం
వంట చేసే బాధ లేదు
స్విగ్గి జోమాటో కి ఆర్డర్
అరగంటలో ఇంటిముందు ప్రత్యక్షం
సరకులు
వస్తువులు
ఇంటి పరికరాలు
అన్నీ అమెజాన్ లో ఆర్డర్
కట్టు బొట్టు జుట్టు
ఒకటేమిటి -సకల వస్తువులు
ముట్టుకోకుండా
పెట్టుకోకుండా
చుట్టుకున్న మాయాజాలంలో
చేతిలోనే అందుబాటులో
అన్నీ ముంగిట్లో
వచ్చివాలడమే నచ్చిన సరకులు
నచ్చకపోతే వాపసు సౌకర్యం!!.
మార్కెట్ కు వెళ్ళేది లేదు
నలుగురు కలిసేదిలేదు
ఒకరితో ఒకరు ఊసులాడేది లేదు
మారుతున్న వసతులు
అందుతున్న వనరులు
జారిపోతున్న సంబంధాలు
గూగుల్ లో కొట్టు
ఇంటిలోనే సరకులు పట్టు
వినియోగదారులకు విపణులకు
మధ్య ఆన్లైన్ బాంధవ్యం.
మారుతున్న జీవనవిధానం
ఉరుకుల పరుగుల జీవితాల్లో
నెట్టింట్లో నట్టింట్లో వంటింట్లో
సాగుతున్న బతుకు పోరాటం
బ్యాంకులో డబ్బులుంటే చాలు
మనిషితో మనిషికి ఆమడ దూరం
అంతర్జాలం లోనే వ్యాపారం
అందరికి సునాయాస సంవిధానం
నేటి ఆధునిక మనిషి
నవ జీవనం!!.
అమ్మేజాన్ అమెజాన్
తెలిసి తెలుసుకొని
జాగ్రత్తగా ఉండి కొంటే మంచిది
అంగడితోనే గండి పడే అవకాశం
పైసలకు రెక్కలువచ్చి
ఎగిరే సదుపాయం
అంతా హోం ఫట్
లేకుంటే మోసాల వలలో చిక్కినట్లే!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## అరచేతిలో వైకుంఠం

అన్నీ అరచేతిలోనే!
నరుడా ఏమి నీ కోరిక?
ఏమి కావాలో చెప్పు, తెచ్చిస్తా!!
చేతిలో చరవాణి ఉంటే చాలు
అమేజాన్, ఫ్లిప్ కార్ట్ లో చూడు
నచ్చింది ఎంచుకుంటే చాలు
క్షణాల్లో ఇంటికి
నగదు చేతిలో ఉండక్కరలేదు
బస్సులో వెళ్ళ నక్కర లేదు
ఫోన్ పే, గూగుల్ పే ఉన్నాయిగా!!
సినిమా చూడాలని ఉందా?
క్యూలో నిలబడే శ్రమ లేకుండా
ఇంటికే టిక్కెట్లు
మంచి రుచులు కావాలంటే
హోటలుకి పోనక్కరలేదు
ఆర్డరిస్తే ఇంటికే
ఇంట్లో వంటలు గతం
ఒంట్లో బద్ధకం
ఫర్నిచర్, సెల్ ఫోన్, డ్రైఫ్రూట్స్
మందులు, మనీ, ఏదైనా
క్షణాల్లో అందుతాయి ఆన్లైన్లో నష్టాలెన్నో..
అడిగింది ఒకటి, వచ్చేది వేరొకటి
బద్ధకం పెరిగి ఊబకాయం
జన సంబంధాల తరుగుదల
ఆరోగ్యంపై దెబ్బ.
ఆన్ లైన్ సరుకుల నాణ్యత నాసి
ముఖం వాచి మిగిలేది నిరాశే
కదలండి కొంచెం
పెంచండి ఆరోగ్యం
మానండి ఆన్ లైన్ షాపింగ్ .

-కోలా సత్యనారాయణ



మే 1న గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కీ.శే.సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి కార్యక్రమంలో కథా రచనలో ప్రముఖ రచయిత్రి సి.యమునకు 'గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా॥ పాపినేని శివశంకర్. చిత్రంలో మరో సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, భూసురపల్లి వేంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, సోమేపల్లి శ్రీవశిష్ట, కందిమళ్ళ శివప్రసాద్, ఎస్.ఎం.సుభానీ, నానా, శర్మ.సి.హెచ్ తదితరులున్నారు.

### జీవజలం బలం

సాహిత్య స్మారకోపన్యాస సభ

18.5.2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, కాన్ఫరెన్స్ హాలులో
బలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది

బలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై
కె.ఎన్. మల్లీశ్వరి, నెల్లుట్ల రామాదేవి ప్రసంగిస్తారు

మామిడి హరికృష్ణ ఆప్తవాక్యం పలుకుతారు

బలం స్త్రీ, ప్రేమలేఖలలోని కొన్ని ముఖ్య భాగాలను -
డా. సలీమా, డా. లక్ష్మి అనిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీ భాష్యం అనురాధ,
నస్రీన్ ఖాన్ లు వినిపిస్తారు

ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి

-- నాళేశ్వరం శంకరం
కన్వీనర్, బలం భావన





సాహిత్యం, సామాజిక
నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



## లక్ష్యం సాధించాలి

ఫలితాలే జీవితమా? ఫలితం కోసమే పయనమా?
ఫలితం రాలేదంటే? శ్రమలన్నీ వ్యర్థమా?.
ఓడిపోయిన ప్రతి అడుగు ఓపికకి పాఠమైతే,
గెలిచిన ప్రతి గమ్యం గర్వానికే ఘనతయేనా?.
నీవు వేసిన చెమటబిందువు గెలుపుకి మించి,
నీ కలలు కన్న దారి ఓ ఫలితానికే తగ్గితే.
తన గుండె బాధ మోసిన తల్లి ఓడిందా ఫలితములో?
బిడ్డ నవ్వుతో తడిచిన క్షణం? గెలుపే కదా జీవనంలో!.
పోతే పోనీ పతకాలు, వస్తే వస్తాయే ఫలితాలు,
జీవితానికెన్నో అర్థాలే? ఒక్కటి కాదు విజయాలు!.
చదువుల్లో తడిసి, చాటులో తలదాచుకుని,
తండ్రి జ్ఞాపకం కోసం ప్రయత్నించిన వాడి విజయం లేని వాడా?
నీ మౌనం మాటలకన్నా మిన్నైతే జీవితం,
నీ శ్రమ నీకు భరోసైతే అదే గొప్ప విజయానికి నిర్వచనం!
కనుక నువ్వు నడిచే దారి ఆశతో నిండి ఉన్నది,
ఫలితం రావకపోయినా? నీ జీవితం వెలుగు గలది!

-డా.భరద్వాజ రావినూతల
కొత్తపట్నం

## కానే కాదు...

ఫలితాలే జీవితమా?
కానే కాదు...
ఫలితం ఏదైనా...
మనం చేసిన పనిలో
ఆర్జించిన జ్ఞానం, తృప్తి, ఆనందం
ఇవే అసలైన ఫలితాలు.....
ఒక్కోసారి ఎంత కృషి చేసినా
ఫలితం దక్కక పోవచ్చు...
అపజయం రుచి చూడగానే
కుంగి పోకుండా....
మడమ తిప్పక అహర్నిశల
కృషి చేస్తూ....
సాగితేనే విజయ శిఖరం
చేరగలం....
బాల్యం నుండే పిల్లలకు
ఆత్మ విశ్వాసం మెండుగా ఉండేలా
శిక్షణ ఇస్తూ పెంచాలి...
ఎటువంటి విషమ పరిస్థితులు
ఎదురైనా...
ధైర్యం సడలక ముందడుగులు వేసేలా
మనో నిబ్బరాన్ని వీడక...
అపజయాన్ని గుణపాఠంగా తీసుకొని
విజయ శిఖరపు నిచ్చెన మెట్లు ఎక్కేలా
ఉంటేనే అవుతుంది జీవితం సార్థకం...

-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు

## ఫలవంతమైన జీవితంకై ప్రయత్నించు..!!

కర్మ చేయడమే నీ వంతు
ఫలితాలు నాకు వదిలిపెట్టు అన్నాడు గీతాచార్యుడు..
ఫలితముండదని కర్మ చేయడం మానుట మూర్ఖత్వం.
ఆశావహ దృక్పథంతో వేసే ప్రతి అడుగు కాగలదు నీ విజయానికి సోపానం..
జీవన పయనంలో గెలుపు ఓటములు సర్వ సహజం.
ఒకరి గెలుపు మరొకరు ఓటమి ఇదే ప్రతి ఆటలో ఉండే తమాషా.
ఫలితమేదైతేనేం ప్రయత్నం చెయ్యడం నీవంతు..
అసలు ప్రయత్నం చెయ్యని వాడికన్నా
ప్రయత్నంలో ఓడిన వాడే కదా మిన్న..
ఓటమిని పాఠంగా తీసుకో..
గెలుపును అనుభవంగా మలచుకో..
నీదైన శైలిలో పట్టుదలతో ముందుకు సాగిపో.
ఫలితాలే జీవితమనుకోకు..
జీవించేది ఫలితాల కోసం కాదు..
ఫలితం జీవితంలో ఓ భాగమే కాని ఫలితాలే జీవితం ముమ్మాటికీ కానేకాదు.
ఫలితాల కోసమే అయితే జీవితం నిస్సారం కాగలదు.
ఎందుకంటే ఫలితాలు అందరికీ అనుకూలంగా ఉండవనేది అక్షర సత్యం..
ప్రతి ఓటమిని సహనంతో స్వీకరించు..
ఎక్కడ పోగొట్టుకున్నావో అక్కడే నుంచే వెదకడం ప్రారంభించు..
ప్రయత్నమే నీ వంతు,ప్రతి ఫలం ఆశించుట అసలొద్దు.
ఎంతో మందికి జీవితం వడ్డించిన విస్తరి కాదు..
మరెంతో మందికి అలసటే కానీ అదాటుగా కలిసి రాదు ఏదీ..
చాలా మందికి అదృష్టమనేది ఆమడ దూరంలో ఆగిపోయి..
ఊరింపుతో,ముందుకు సాగనీక వెనక్కు మరలనీక వేధిస్తుంది..
అందుకే ఫలితం కోసం కాక ఫలవంతమైన జీవితంకై ప్రయత్నించు ..
ఫలితాలే జీవితమన్న దృక్పథాన్ని దారి మళ్ళించు..!!.

-డా. మరుదాడు అహల్యా దేవి, బెంగుళూరు

## "గమనం ఒక గాథ"

క్షణంలో మారే ఈ జీవితాలకు ఆ ఆంక్షలెందుకో!
లక్ష్యముచూపని వెర్రి ప్రేమెందుకో!.
ఫలితాలతో పోల్చి ,జీవితాలతో ఆడుకునే ముందు
గత చరితలు పరికించి చూడండి..
పోలికలతో కుప్పకూలే చరితలెన్నో మీ కళ్ళ ముందు కైక,దుర్యోధనునిలా
ఎదురుపడుతాయా..
ఫలితాలతో యుద్ధాలు చేసి చిరునవ్వులతో వికసించవల్సిన లేలేత మొగ్గలను
ఆదిలోనే తుంచకండి..
వారి కంటూ రేపన్నది ఒకటున్నది.
ఎంతో అందంగా, ఉన్నతంగా లిఖించబడిన పేజీ ఉంటుంది..
ఆ పరిమళాలు ఆఘ్రానించకుండా
ఆదిలో జీవితపుస్తకాలను అతి బాధ్యతతో బుగ్గిపాలు చేయకండి...

-శ్రీదేవి సురేష్ కుసుమంచి

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.